ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు

ఆదివారం 2, నవంబరు 2025



కనిగిరి మండలం నందనమారెళ్లలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

గడపగడపకు వెళ్లి..

సామాజిక పింఛన్లు అందజేత

- కొద్దిగంటల్లోనే మూడొంతుల మందికి పూర్తి
- తూర్పునాయుడుపాలెంలో పాల్గొన్న మంత్రి స్వామి
- ఇతరచోట్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

ఒంగోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా సాగింది. పేదల సేవలో ప్రభుత్వం పేరుతో ప్రతినెలా 1న పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. స్థానికంగా మంత్రి నుంచి సచివాలయ సిబ్బంది వరకు వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఇందులో భాగస్వాములు కావాలని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఉదయం 6.30 గంటల నుంచే సచివాలయ సిబ్బంది తమ పరిధిలో పింఛన్ల పంపిణీని చేపట్టారు. జిల్లాకు ఈనెలకు సంబంధించి 2,83,704 మంది లబ్ధిదారులకు రూ.125.39 కోట్లు మంజూరయ్యాయి. వీటి పంపిణీకి 5,495 మంది సిబ్బందిని కేటాయించారు. ఉదయం పది గంటలకే 75శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయానికి 89.82 శాతంతో 2,54,923 మంది లబ్ధిదారులకు రూ.111.89 కోట్ల నగదు పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు సాయంత్రం అందజేశారు. కొద్దిమంది అందుబాటులో లేకపోగా వారికి తర్వాత ఇవ్వనున్నారు.

ప్రజాప్రతినిధులంతా హాజరు

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి డాక్టర్ స్వామి తన స్వగ్రామమైన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరపరిధిలోని త్రోవగుంటలో, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మద్దిపాడు

మిగతా 6వ పేజీలో

9,051 కుటుంబాలకు అండగా ప్రభుత్వం

నిత్యవసర సరుకుల పంపిణీకి కలెక్టర్ రాజాబాబు ఆమోదం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన 9,051 కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు ఇవ్వనుంది. ఈమేరకు తహసీల్దార్లు ఇచ్చిన నివేదికకు కలెక్టర్ రాజాబాబు ఆమోదముద్ర వేశారు. ఇప్పటికే ముంపు ప్రాంతాల్లో కొన్నిచోట్ల బాధిత కుటుంబాలకు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో 6,022 మత్స్యకార, చేనేత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, పంచదార, బంగాళాదుంప, ఆయిల్ పంపిణీ చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న 3,029 కుటుంబాల్లో ఒక్కోదానికి 25కిలోల బియ్యంతోపాటు ఇతర సరుకులు అందజేయనున్నారు. ఇప్పటికే సరుకులను పంపిణీ చేసేందుకు ఆయా ప్రాంతాలకు సరఫరా చేశారు.



గణపవరం సమీపంలో సాగర్ ప్రధాన కాలువకు పడిన గండి

సాగర్ ప్రధాన కాలువకు గండి

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- రెండ్రోజులుగా అక్కడే ఎన్నెస్పీ అధికారులు

వివరాలు మెయిన్‌లో..



శీనారెడ్డిని విచారిస్తున్న త్రిసభ్య కమిటీ (ఫైల్)

వేటు తప్పదు!

- వైసీపీ పాలనలో డ్వామాలో అవినీతి అనకొండపై ప్రభుత్వంలో కదలిక
- పూర్వపు పీడీ శీనారెడ్డి అక్రమాలపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు
- 24 అభియోగాలపై సంజాయిషీ కోరుతూ తాఖీదులు
- కఠిన చర్యలకు కలెక్టర్ సిఫార్సు చేసిన ఎనిమిది నెలల అనంతరం చర్యలకు సిద్ధం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో అవినీతి అనకొండగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వపు పీడీ కె.శీనారెడ్డి అక్రమాలపై చర్యలకు ఎట్టకేలకు ఉన్నత స్థాయిలో కదలిక వచ్చింది. ఆయన ప్రస్తుతం గుంటూరు డివిజనల్ సహకార శాఖ అధికారిగా ఉన్నారు. అవినీతి, అక్రమాలు.. నిధుల దుర్వినియోగంపై సమగ్ర నివేదికతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఎనిమిది నెలల క్రితం నాటి కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇప్పటికి ఈ అంశంపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ నివేదికలో పేర్కొన్న 24 అంశాలపై వివరణ కోరుతూ ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ (అభియోగ పత్రం)ను శీనారెడ్డికి పంపుతూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. నోట్‌ను అందుకున్న పది రోజుల్లోపు లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని అందులో ఆదేశించారు. ఉత్తర్వుల కాపీలను శీనారెడ్డితోపాటు వ్యవసాయ, సహకార, పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు పంపారు.

ఒంగోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ల డిప్యుటేషన్‌పై పనిచేసిన శీనారెడ్డి అక్రమాలపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆ మేరకు నోటీసులు జారీ చేసింది. ఆయన పనిచేసిన కాలంలో అవినీతి, అధికార దుర్వినియోగం తదితర అంశాలు ప్రజా ప్రభుత్వం రాగానే వెలుగులోకి వచ్చాయి. వాటిపై విచారణ, చర్యలకు ప్రభుత్వానికి కలెక్టర్ సిఫార్సు చేశారు. ఆయా అంశాలను పరిశీలిస్తే.. వైసీపీ ప్రభుత్వంలో డ్వామా పీడీగా పనిచేసిన శీనారెడ్డి అప్పట్లో అధికార పార్టీ కీలక నేతల అండదండలతో ఇష్టారీతిగా అవినీతికి పాల్పడి దోచేశారన్న ఆరోపణలు, విమర్శలు అధికంగా ఉన్నాయి. ఆ శాఖలో తన ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ నిబంధనలు పట్టించుకోకుండా అక్రమాలకు పాల్పడ్డారని.. తద్వారా పెద్దఎత్తున అడ్డగోలుగా సంపాదించారని ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్, మరో ఐదుగురు వ్యక్తిగతంగా వివిధ స్థాయిల్లో ఇచ్చిన ఫిర్యాదులతోపాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు చేరాయి.

అక్రమాలు నిజమేనన్న త్రిసభ్య కమిటీ

ఆయా ఫిర్యాదులపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో నాటి కలెక్టర్ తమీమ్ అన్సారియా గత ఏడాది

మిగతా 6వ పేజీలో

రేపు ఒంగోలులోనే 'మీ కోసం'

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) సోమవారం ఒంగోలులోనే నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేశు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కలెక్టరేట్‌లోని మీకోసం భవన్‌లో అధికారులు అర్జీలను స్వీకరిస్తారన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రూ.266.51 కోట్లు

మొంథా తుఫాన్ నష్టం ఇదీ..

- ఒక్క ఆర్‌అండ్‌బీకే రూ.180.66 కోట్లు
- వ్యవసాయ, ఉద్యాన శాఖల పరిధిలో 11,144 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జిల్లాకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కుండపోత వర్షం కురవడంతో వివిధ శాఖలకు రూ.266.51 కోట్ల మేర నష్టం వాటిల్లింది. అందులో ప్రధానంగా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక్క ఆర్‌అండ్‌బీ శాఖకే రూ.180.66 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.70.41కోట్ల మేర నష్టం జరిగింది. విద్యుత్‌శాఖకు రూ.3.36కోట్లు, నగరపాలక, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో రూ.10.91 కోట్ల మేర మేర నష్టం వాటిల్లింది. మత్స్యశాఖకు రూ.88 లక్షలు, పశుసంవర్ధకశాఖకు రూ.19 లక్షలు నష్టం జరిగింది. జిల్లాలో 11,114 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అందులో వ్యవసాయశాఖ పరిధిలో 10,274 హెక్టార్లలో పలు రకాల పంటలు, ఉద్యానవన శాఖ పరిధిలో 870 హెక్టార్లలో వివిధ తోటలు ఉన్నాయి. గృహాలు 47 దెబ్బతిన్నాయి. ఈ మేరకు ఆయా శాఖల ద్వారా ప్రాథమికంగా అంచనా వేసి కలెక్టరేట్‌కు పంపారు. కలెక్టరేట్ నుంచి ప్రభుత్వానికి నివేదించారు.



నికరంపల్లిలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే కందుల

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

- రైతులందరికీ న్యాయం చేస్తాం
- కలెక్టర్ రాజాబాబు
- పశ్చిమప్రాంతంలో పర్యటన
- దెబ్బతిన్న పంటలు, కంభం చెరువు పరిశీలన
- మార్కాపురంలో అధికారులతో సమీక్ష

వివరాలు 6,7 పేజీల్లో



సీఎం చంద్రబాబు నుంచి అవార్డులు అందుకుంటున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల , బీఎన్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

మొంథా ఫైటర్స్

- తుఫాన్ తీవ్రతను ఎదుర్కొన్నారని ప్రజాప్రతినిధులు, అధికారులకు కితాబు
- మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, అధికారులకు ముఖ్యమంత్రి అవార్డులు
- సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా కాపాడారని అభినందన

ఒంగోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపై మొంథా తుఫాన్ విరుచుకుపడి అల్లకల్లోలం చేయగా అప్రమత్తమైన అధికారులు, ప్రజాప్రతినిధులు బాగా పనిచేశారని సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. యంత్రాంగాన్ని పార్టీ కేడర్‌ను సమన్వయం చేసి గణనీయంగా నష్టాన్ని తగ్గించడంలో క్రియాశీలకంగా వ్యవహరించారని కితాబిచ్చారు. జిల్లాకు చెందిన ముగ్గురు కీలక ప్రజాప్రతినిధులను ఆయన అభినందించారు. తుఫాన్ సమయంలో వారు అందించిన సేవలను ప్రశంసిస్తూ మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవార్డులను అందజేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో గత నెల 27 నుంచి 29 వరకు

మిగతా 6వ పేజీలో



వైభవంగా ఉత్థాన ఏకాదశి

ఉత్థాన ఏకాదశిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు శనివారం వైభవంగా జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాలకు భారీగా తరలివెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు విష్వక్సేన పూజ, కలశారాధన, రమా సహిత సత్యనారాయణ స్వామి వారికి అభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. పలుచోట్ల సామూహిక వ్రతాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్

ఒంగోలులోని సంతపేట సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు



కూరగాయల ధరలు మండుతున్నాయ్!

- భారీ వర్షాలకు దెబ్బతిన్న తోటలు
- కిలోకు రూ.10నుంచి 20 వరకు పెరుగుదల
- కిలో రూ.100 దాటిన పెద్ద చిక్కుళ్లు
- బంగాళాదుంప, దోస మినహా మిగిలినవన్నీ రూ.50పైనే..

7

పంచాయతీలో ఉద్యోగోన్నతుల జాతర

- ఇప్పటికే పలు గ్రేడ్‌లలోని కార్యదర్శులకు అమలు
- తాజాగా గ్రేడ్-6కు ప్రమోషన్ కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతుల పరంపర కొనసాగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేనివిధంగా పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించారు. ఇప్పటికే వందలాది మందికి ఉద్యోగోన్నతులు లభించాయి. తాజాగా గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్ ఇచ్చేందుకు ఆశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ఉద్యోగులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. పంచాయతీ కార్యదర్శుల విభాగంలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 వరకు ఉన్నారు. గత నెలలో 88మంది గ్రేడ్-5లకు గ్రేడ్-4లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. తాజాగా 54 మంది గ్రేడ్-6 విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించేందుకు ఈనెల 4న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆ వెంటనే పదోన్నతి ఆర్డర్లు ఇస్తామని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.



పట్టుకున్న రేషన్ బియ్యం వాహనాలతో ఎన్‌జీపాడు ఎస్ఐ రజియాసుల్తానా, సిబ్బంది

నాలుగు వాహనాలు.. 545 రేషన్ బియ్యం బస్తాలు..

6

- చదలవాడ సమీపంలో పట్టుకున్న ఎన్‌జీపాడు పోలీసులు
- కావలికి తీసుకెళ్తున్నట్లు గుర్తింపు
- స్టేషన్‌కు తరలింపు
- టంగుటూరు వద్ద 41 బస్తాలు స్వాధీనం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం

● వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

● కలెక్టర్ రాజాబాబు

మార్కాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ రాజాబాబు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా తుఫాన్ నేపథ్యంలో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి మార్కాపురం, వేములకోట చెరువులను డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో దెబ్బతిన్న పత్తిని వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా రికార్డుస్థాయిలో ఒక్కసారిగా తుఫాన్ ప్రభావంతో 20 సెంటీ మీటర్ల వర్షం కురిసిందన్నారు. తద్వారా వాగులు, వంకల్లో ప్రవాహం పెరిగి పంట పొలాలు, కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు చేరాయన్నారు. కొన్నిచోట్ల రోడ్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా నష్టాలను నమోదు చేస్తున్నామన్నారు. పూర్తి సమాచారం రాగానే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. తుఫాన్ సమయంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాగంతో కలిసి సమన్వయం చేసుకుని పనిచేయడంతో ప్రాణనష్టాన్ని నివారించగలిగామన్నారు. అధిక వర్షంతో చెరువులకు గండ్లు పడ్డాయన్నారు. మార్కాపురం చెరువుకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. చెరువు నీటిని సమర్థంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తే ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చన్నారు. మొంథా తుఫాన్ సమయంలో ముఖ్యమంత్రి అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు పార్టీ కేడర్‌ను సమన్వయంతో దిశానిర్దేశం చేసి తీవ్రత తగ్గేలా పని చేయించారన్నారు. నష్టపోయిన రైతులను కూడా తప్పకుండా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎస్ఈలు వరలక్ష్మి, అబూతలీమ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఎస్ఈలు బాలశంకర్‌రావు, రవినాయక్, అశోక్‌కుమార్, డీపీవో వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు, వివిధ శాఖల డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అక్రమంగా రేషన్ తరలిస్తున్న బియ్యం లారీని పట్టుకుంటున్న ఎస్సై, పోలీసులు

రేషన్‌బియ్యం తరలిస్తున్న వాహనాల పట్టివేత

నాగులుప్పలపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న నాలుగు వాహనాలను ఎస్ఐ రజియాసుల్తానా పట్టుకున్నారు. చీరాల ప్రాంతం నుంచి కావలికి నాలుగు వాహనాలలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు చదలవాడ సమీపంలోని పశు క్షేత్రం వద్ద గల జాతీయ రహదారిపై ఎస్ఐ రజియాసుల్తానా తన సిబ్బందితో శనివారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయా వాహనాల్లో 545 రేషన్‌బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

41 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

టంగుటూరు (కొండపి) : కొండపి వైపు నుంచి కావలికి మినీ ట్రక్కులో తరలిస్తున్న 41 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం టంగుటూరులోని ఫ్లై ఓవర్ వద్ద పట్టుకున్నారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న మద్దెల కిషోర్, చేవూరు వినోద్, దాసరి రాంబాబు, నాసిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మినీ ట్రక్కును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మొంథా ఫైటర్స్

(5వ పేజీ తరువాయి)

కురిసిన భారీ వర్షాలు, తీవ్రగాలులతో రాష్ట్రం మొత్తం అతలాకుతలమైన విషయం విదితమే. జిల్లాపై ఆ ప్రభావం అత్యధికంగా కనిపించింది. తూర్పు ప్రాంతంలోని ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, కొండపి నియోజకవర్గాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అతి భారీ వర్షాలు కురిశాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టుతో పాటు ఈ మూడు నియోజకవర్గాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఒంగోలులోని పలు కాలనీలతోపాటు అనేక గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. ఇంతటి బీభత్సం జరిగినా ఎక్కడా ప్రాణనష్టం చోటుచేసుకోలేదు. రోడ్లు, కరెంటు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల వనరులకు పరిమితంగానే దెబ్బ తగిలింది. ఇక ప్రజల ఆస్తులకు ఎక్కడా నష్టం జరిగిన దాఖలాలు లేవు. అదే సమయంలో జలదిగ్బంధంలో చిక్కుకున్న, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులకు అండగా నిలవడం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, ఇతర సహాయక చర్యలు, వచ్చిన వరదనీరు ఆగకుండా పోయేలా చేయడం, వర్షం వెలిశాక స్థానికంగా వ్యాధులు, ఇతర సమస్యలు ప్రబలకుండా పారిశుధ్యం, క్లోరినేషన్ బ్లీచింగ్ ఇతరత్రా చర్యలు వేగవంతంగా జిల్లాలో సాగాయి. ఈ మొత్తం వ్యవహారంలో జిల్లా యంత్రాంగం బాగా పనిచేయగా వారికి నిరంతరం అందుబాటులో ఉండటం, అర్ధరాత్రి వేళల్లో కూడా అప్రమత్తంగా ఉండి స్వయంగా సహాయక కార్యక్రమాల్లో పాల్గొనడం, క్షేత్రస్థాయిలోని పార్టీ కేడర్‌ను సమన్వయం చేసి ప్రజలకు అండగా నిలవడంలో ఈ ప్రాంత అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విశేషంగా కృషి చేశారు. తుఫాన్ వెలిసిన రెండు రోజుల్లోనే ప్రజలు సాధారణ స్థితిలోకి రాగలిగారు. మొంథా తుఫాన్ సమయంలో అప్రమత్తంగా పనిచేసిన ప్రజాప్రతినిధులు, అధికారులకు అవార్డులు ఇచ్చి సత్కరించాలని సీఎం నిర్ణయించారు. తదనుగుణంగా శనివారం ఉదయం ఉండవల్లిలో సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 175మంది ప్రజాప్రతినిధులు, అధికారులను మొంథా తుఫాన్ ఫైటర్స్ పేరుతో ప్రభుత్వం తరఫున అవార్డులను అందజేశారు. అందులో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్‌లకు ఈ అవార్డులు దక్కాయి. సీఎం చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అలాగే ఉత్తమ సేవలు అందించిన జాబితాలో ఉన్న ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావులకూ కూడా సీఎం చంద్రబాబు అవార్డులను అందజేశారు.

గడప గడపకు వెళ్లి..

(5వ పేజీ తరువాయి)

మండలం సీతారాంపురం పంచాయతీ కోస్టాల్ సెంటర్‌లో పాల్గొన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నందనమారెళ్లలో, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని 8వవార్డు పరిధిలో, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాచర్ల మండలం అనుమలవీడులో పింఛన్‌లు పంపిణీ చేశారు. టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు దోర్నాల పట్టణంలో, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలం దేకనకొండలో పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ● పంట పొలాలను పరిశీలించిన అధికారులు ● ప్రభుత్వం దృష్టికి నష్టం అంచనా

పర్చూరు, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఆయన ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. పైర్లు దెబ్బతిన్న రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మండలంలోని నాగులపాలెం, ఉప్పు టూరు, వీరన్నపాలెం, పోతుకట్ల, కొమర్నేని వారి పాలెం గ్రామాల్లో పర్యటించి తుఫాను వల్ల దెబ్బతిన్న ఇళ్లు, పంటను పరిశీలించారు. నియోజకవర్గంలో ప్రత్తి, వరి, మినుము, మొక్కజొన్న, జూట్ పంటలకు నష్టం జరిగిందన్నారు. తుపాను వలన దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను తక్షణమే చేపట్టాలని సంబంధిత ఆర్ అండ్‌బి అధికారులను ఆదేశించారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై దృష్టి

బర్లీ పొగాకు రైతుల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి మిగిలి ఉన్న పొగాకును కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. పొగాకును కొనుగోలు చేసేవిధంగా ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీచేశారన్నారు.

మిరపతోటల పరిశీలన

పంగులూరు : మండలంలోని బూదవాడ గ్రామంలో మొంథా తుపానుతో దెబ్బతిన్న మిరప, మినుము పంటలను ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి, ఉద్యానఅధికారి దీప్తి శనివారం పరిశీలించారు. మినుము, మిరప పంటలకు జరిగిన నష్టాన్ని రైతులు అధికారులకు వివరించారు. కొంత పొలంలో మిరపకు అధికమొత్తంలో నష్టం వాటిల్లినట్లు గుర్తించామని హెచ్‌వో దీప్తి తెలిపారు. మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పూర్తిగా నమోదుచేసి, నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా సిబ్బంది అంచనాలను రూపొందించాలని ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూ పారాణి సిబ్బందికి సూచించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వర్షానికి వడబడి ఒరిగిన మిరపను కాపాడుకొనేందుకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఉద్యాన శాఖ అధికారి దీప్తి సూచించారు. ఉరకెత్తిన పొలంలో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10గ్రాముల యూరియా, 10గ్రాముల పంచదార కలిపిన వారం రోజుల వ్యవదిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలు వడబడి తలలు వాలినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పైపాటుగా ఎకరానికి అదనంగా 30కిలోల యూరియా, 15కిలోల పొటాష్, 200కిలోల వేపపిండి వేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దెబ్బతిన్న మిరప తోటలను గుర్తించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

బల్లికురవ : మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలతో 33 శాతం మేర పంట దెబ్బతింటే పంట నష్ట జాబితాలో నమోదు చేయాలని ఏవో శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలోని వేమవరం గ్రామం లో పత్తి పంటను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసా య సిబ్బందితో మాట్లాడారు. వర్షాల వలన దెబ్బ తిన్న పంటల వివరాలను నిష్పక్షపాతంగా నమోదు చేయాలన్నారు. పంటలు దెబ్బ తిన్న రైతుల వివరాలు మాత్రమే ఉండాలన్నారు. జాబితాలు సిద్ధం అయ్యాక సచివాలయాలలో ఉంచుతామన్నారు. ఎక్కడ అవకతవకలు చోటుచేసుకోకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పంట నష్ట జాబితాలను నమోదు చేస్తున్నామని తెలిపారు.



వీరన్నపాలెం వద్ద వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

నష్టపరిహారం అందించేందుకు చర్యలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

నూతలపాడు(పర్చూరు) : మొంథా తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. శనివారం మండంలోని నూతలపాడు గ్రామంలో ఏవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. త్వరితగతిన పైర్లను పరిశీలించి, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, సిబ్బంది ఉన్నారు.





బూదవాడలో మిర్చిని పరిశీలిస్తున్న అధికారులు, నూతలపాడులో పొలాలను పరిశీలిస్తున్న లవన్న

వేటు తప్పదు

(5వ పేజీ తరువాయి)

డిసెంబరులో అప్పటి ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించారు. ఆ కమిటీ డిసెంబరు, జనవరి నెలల్లో డ్వామా కార్యాలయంలో రికార్డుల పరిశీలించింది. ఫిర్యాదుదారులైన ఈదర మోహన్, ఇతర వ్యక్తులు, ఆరోపణలు ఎదుర్కొన్న శీనారెడ్డి, అలాగే ఫిర్యాదులోని అంశాలతో సంబంధం ఉన్న డ్వామా ఉద్యోగులు కలిపి మొత్తం 70మందికిపైగా ప్రత్యక్షంగా విచారించింది. వారి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంది. అందుబాటులో ఉన్న అన్ని రికార్డులు పరిశీలించింది. ఫిర్యాదులో పేర్కొన్న అనేక అంశాలు వాస్తవాలేనని డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో భారీగా ప్రభుత్వ ధనం దుర్వినియోగం జరిగినట్లు త్రిసభ్య కమిటీ విచారణలో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా పాలనాపరమైన నిర్ణయాలు, అధికార దుర్వినియోగం జరిగిందని.. కొన్ని అంశాలలో ఆ కార్యాలయ ఉద్యోగుల పాత్ర కూడా ఉందని కమిటీ తమ విచారణలో తేల్చింది. ఆ మేరకు కమిటీ సభ్యులు నివేదించగా పరిశీలించిన నాటి కలెక్టర్ అన్సారియా దాదాపు 2వేల పేజీల నివేదికను ప్రభుత్వానికి పంపుతూ శీనారెడ్డిపై కఠిన చర్యలకు సిఫార్సు చేశారు.

పైస్థాయిలో మేనేజ్ చేశారని ప్రచారం..

ఈ ఏడాది ఫిబ్రవరి 11న కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపగా అనంతరం చర్యలు చేపట్టకుండా ఉన్నత స్థాయి అధికారులతో తనకు ఉన్న సంబంధాలతో శీనారెడ్డి అపుకున్నారన్న ప్రచారం ఆ శాఖ వర్గాల్లో సాగింది. అలాగే శీనారెడ్డి అడ్డగోలుగా డ్వామాలో వ్యవహరించిన సమయంలో జిల్లాలో ఆయనకు గాడ్‌ఫాదర్‌గా ఉన్న నాటి అధికార పార్టీ కీలక నేత, ప్రస్తుతం కూటమి పార్టీలో ఉండి శీనారెడ్డిపై చర్యలు ముందుకు సాగకుండా సహకరిస్తున్నారన్న ఆరోపణలు కూడా బలంగా వినిపించాయి. సాధారణంగా ఇలాంటి నివేదికలు కలెక్టర్ల నుంచి చేరితే వారం, పది రోజుల్లో చర్యలు ఉంటాయి. అలాంటిది శీనారెడ్డి వ్యవహారంలో కలెక్టర్ నివేదిక పంపిన తర్వాత నెలల తరబడి చర్యలు లేకపోవడంతో అలాంటి ఆరోపణలు వాస్తవమేనని ప్రచారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన కొందరు కీలక ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి నేతలు, ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. కలెక్టర్ నివేదిక ఆధారంగా 24 అంశాలపై సంజాయిషీ కోరుతూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తాజాగా శీనారెడ్డికి తాఖీదులు ఇచ్చారు. అందులో 24 అంశాలను స్పష్టంగా పేర్కొన్నారు.

అవినీతి, అక్రమ వ్యవహారాలు ఇలా..

● సంజాయిషీలో ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి. కార్యాలయంలో పనులు సక్రమంగా జరిగాయని నిర్ధారించకుండా, పరిశీలన చేయకుండానే రూ.1.84 కోట్ల ఉపాధి నిధులు విడుదల చేయడం ఆయన అధికార దుర్వినియోగానికి, విధులలో నిర్లక్ష్యానికి నిదర్శనం.

● కొనకనమిట్ల ఏపీవో డి.రవిబాబుపై రూ.41.03 లక్షలు రికవరీకి ప్రొసీడింగ్స్ ఇచ్చి ఆ మొత్తం వసూలు చేయాల్సి ఉండగా రూ.3.42 లక్షలు మాత్రమే రాబట్టారు. ఆయన వద్ద రూ.53వేలు జరిమానా విధించి తిరిగి అదేచోట పోస్టింగ్ ఇచ్చారు. తద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడటంతోపాటు ప్రభుత్వ నిధులకు నష్టం చేశారు.

● సర్వీసు నిబంధనలు పాటించకుండా పీఆర్ నుంచి సూపరింటెండెంట్ కేడర్‌లో డ్వామాలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పి.వెంకటస్వామి నియామకం, మండలాల్లో కీలకమైన ఈసీ, జేఈ పోస్టులలో వ్యక్తిగత లాభాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

● పెద్దారవీడు, కొండపి మండలాల్లో తగిన పరిశీలన చేయకపోవడంతో ఉద్యోగులు రూ.21.65 లక్షలు దుర్వినియోగం చేయగా కమిటీ పరిశీలన సమయంలో తప్పుడు నివేదికలు రూపొందించడం మోసపూరిత చర్యగా గుర్తించారు.

● డ్వామాకు ప్రభుత్వం మంజూరు చేసిన సిబ్బంది సంఖ్య కన్నా అధికంగా వ్యక్తిగత స్వార్థం కోసం తన ఇష్టం వచ్చినట్లు నియమించారు.

● జలకళ పథకానికి సంబంధించి బ్యాంకుల్లో జమ అయ్యే వడ్డీని తనకు అనుకూలంగా ఉండే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా అక్రమంగా డ్రా చేయించారు.

● జగనన్న కాలనీల్లో చేపట్టిన పనులకు సంబంధించి ఉపాధి నిధుల వినియోగంలో జిల్లాలో భారీగా అవినీతి, అక్రమాలకు ఆయనే బాధ్యుడు.

● గతంలో డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేసిన కాలంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉద్యోగి అయిన తన భార్య పేరుతో వాహన బిల్లులు తీసుకున్నారు. డ్వామా పీడీగా నెలకు రూ.45వేలు మాత్రమే వాహనానికి చెల్లించే అవకాశం ఉండగా రూ.60వేలు వంతున బిల్లులు డ్రా చేశారు.

● పీడీగా తనకు ఉన్న అధికారాలను దుర్వినియోగం చేస్తూ పెద్దఎత్తున ఉద్యోగుల బదిలీలు, నియామకాలు చేశారు. సేవా నియామకాలకు విరుద్ధంగా కందుకూరు ఏపీవో సుభాషిణిని అక్కడ ఇన్‌చార్జి ఏపీవోగా, సూపరింటెండెంట్ వెంకటస్వామిని ఇన్‌చార్జి ఏపీవోగా, మరో చిన్నస్థాయి ఉద్యోగిని మార్కాపురం ఏపీడీగా నియమించి వారి కన్నాపై స్థాయి అధికారులైన ఎంపీడీవోలపై పర్యవేక్షణకు పెట్టడం నిబంధనలకు విరుద్ధం.

● ఒంగోలు ఏపీడీ పరిధిలో రూ.10.90 లక్షలను అటెండర్ నకిలీ సంతకాలతో బ్యాంకు నుంచి డ్రా చేయగా క్రిమినల్ కేసు పెట్టకుండా పెండింగ్ విచారణ పేరుతో ఆ ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌బాబుకు అర్హతలు లేకపోయినా హెచ్‌ఆర్ మేనేజర్‌గా నియమించారు. కార్యాలయానికి భోజనాలు, స్నాక్స్ ఇతరత్రా సరఫరాలో భారీగా బోగస్ బిల్లులతో డ్రా చేయించారు. ఇవన్నీ ఫైనాన్స్ విభాగంలోని ఉద్యోగి ద్వారా చేయించారు.

● త్రిపురాంతకం మండలంలో 4వ రౌండ్ సోషల్ ఆడిట్‌లో రూ.3.81కోట్లు దుర్వినియోగమైనట్లు తేలగా అందుకు బాధ్యులైన పది మంది ఉద్యోగులు సస్పెండయ్యారు. వారిపై కలెక్టర్ ఆదేశాలు లేకుండా తొలుత ఏడుగురిని, తర్వాత మిగిలిన ముగ్గురిని విధుల్లోకి తీసుకున్నారు.

వాటర్‌షెడ్ స్కీం నుంచి రూ.1.94 కోట్లను బ్యాంకు నుంచి ఉపసంహరించి ఆ మొత్తాలను ఆఫీసు ఖర్చులకు వినియోగించడం ప్రభుత్వ ఆర్థిక నియామకాలకు, వాటర్‌షెడ్ పథకం మార్గదర్శకాలకు వ్యతిరేకం. ఆయా అంశాలపై సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విచారణ అనంతరం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే ఇంతటి తీవ్రస్థాయిలో ఆర్థిక అక్రమాలు, అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారిని కనీసం సస్పెండ్ కూడా చేయకుండా సంజాయిషీ కోరడం వెనుక ఉన్నత స్థాయి అధికారులు, నాటి ప్రభుత్వంలో కీలకంగా నేడు కూటమి పార్టీలో చేరిన నాయకుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యం.. స్తంభించిన ట్రాఫిక్

పేరాల(చీరాల), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన శనివారం సాయంత్రం పేరాల కారంచేడు రైలు గేటు వద్ద చోటుచేసుకొంది. రైళ్ల రాకపోకల కారణంగా కారంచేడు రైలు గేటు కొద్దిసేపు పడింది. దీంతో చీరాల నుంచి బాపట్ల, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నాయి. అదే సమయంలో చీరాల నుంచి రేపల్లె వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా కుడివైపు రాంగ్ రూట్‌లో బాగా ముందుకు వెళ్లాడు. అయితే అదేసమయంలో ఎదురుగా గుంటూరు నుంచి చీరాలకు వస్తున్న మరో ఆర్టీసీ బస్సు వచ్చింది. దీంతో రెండు బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. పైగా రెండు బస్సుల కారణంగా ట్రాఫిక్ నిలిచి ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఇద్దరు డ్రైవర్లు 'నీ బస్సు పక్కకు తీయమంటే, నీ బస్సు తీయి' అని వాగ్వాదానికి దిగారు. దీంతో గుంటూరు బస్‌డ్రైవర్ ఏకంగా బస్ దిగి కిందకు వెళ్లి దూరంగా నిలబడ్డాడు. కొద్దిసేపటికే రేపల్లె డస్ డ్రైవర్ చేసేదేమీ లేక బస్‌ను వెనక్కు తీయడంతో సమస్య సద్దుమణిగింది. అయితే ఇదంతా చూస్తున్న ప్రజలు బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యంపై చివాట్లు పెడుతున్నారు. అధికారులు ఘటనపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎదురెదురుగా నిలిచిన ఆర్టీసీ బస్సులు

పొలాల్లో నీరు బయటకు పంపే ఏర్పాట్లు చేయండి

ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచన

చినగంజాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో ముంపు బారిన పడిన పొలాల్లో నీటిని తక్షణం బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రబావంతో మండల పరిధిలోని కడవకుదురు, గొనసపూడి ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలను, కొమ్మమూరు, రొంపేరు కాలువలను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. సుమారు మూడు వేల ఎకరాల వరి పంట నీటిలో మునిగిందని, ఐదు రోజులుగా నీరు తగ్గ లేదని చీరాల ఏడీఏ రత్నకుమారి కలెక్టర్‌కు వివరించారు. మూడు రోజుల తర్వాత కూడా నీరు తగ్గకుంటే ఆ వరి పొలాలను నమోదు చేయాలని ఏవోను కలెక్టర్ ఆదేశించారు. పొలాలు ఎన్ని రోజుల నుండి వరద నీటిలో ఉన్నాయి, నీరు బయటకు పోవడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందని రైతుల ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరిపొలాలు నీటమునిగి ఇప్పటికే ఐదు రోజులు అయిందని, వరద నీరు పూర్తిగా పోవాలంటే వారం రోజులు పడుతుందని, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద తగ్గితేనే పొలాలు బయట పడతాయని రైతులు కేశన బాలయ్య, జి.తిరుపతి రావు, నక్కల సుబ్బారావు, వడ్లమూడి రామకష్ణ, తోటకూర రాజేష్‌లు కలెక్టర్‌కు వివరించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందజేస్తామని అన్నారు. పొలాలలో నిలిచిన నీటిని ఏ విధంగా తొలగించాలన్న ప్రణాళికలు తయారు చేయాలని, డ్రోన్స్‌ను ఉపయోగించి ఎక్కడ నీటిని తొలగించే అవకాశం ఉంటే అక్కడ నుండి నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రొంపేరు, కొమ్మమూరు కాలువల ద్వారా ప్రవహించే వరదనీటిని ఆయన ఇరిగేషన్ శాఖధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, మండల సర్వేయర్ లోకేష్, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, చింతగుంపల్లె పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



కడవకుదురులో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో నెల్లూరు నగరంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలానికి చెందిన లావణ్య(21)కు నెల్లూరు 4వ మైలు ప్రాంతానికి చెందిన వినోద్‌తో 2023 మేలో వివాహం జరిగింది. వారికి 5 నెలల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం వారు నగరంలోని మల్లె తోటలో నివాసం ఉంటున్నారు. ఇటీవల దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని ఆమె తన కుటుంబసభ్యులకు చెప్పగా వారు పలు మార్లు దంపతులకు నచ్చజెప్పి సంతోషంగా కాపురం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి వినోద్ పని నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. శనివారం లావణ్య తన అక్క కీర్తికి, భర్తకు నేను చనిపోతున్నానని మెసేజ్ చేసింది. దీంతో కీర్తి విషయాన్ని తన తండ్రి కోటేశ్వరరావుకు తెలియజేయగా ఆయన నెల్లూరులో ఉన్న తన మరదలు కామేశ్వరికి ఫోన్‌చేసి చెప్పారు. ఆమె తన భర్తతో కలిసి లావణ్య ఇంటికి వెళ్లి చూడగా తలుపులు లోపల గడియపెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లి చూడగా లావణ్య చీరతో ఫ్యానుకు ఉరి వేసుకొని వేలాడుతూ కన్పించింది. వెంటనే ఆమెను కిందకు దించి నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి నెల్లూరుకు చేరుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను అభినందించిన సీఎం

● నియోజకవర్గంలో ఉత్తమ సేవలకు అభినందన

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొండయ్యను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో పంట పొలాలు, నివాసాలు, చేనేత మగ్గాల్లో సైతం మోకాళ్ల లోతుల్లో నీళ్లు చేరి ప్రజలు భీతిల్లారు. వాడ రేవు - రామాపురంలో మూడు వంతెనలు సైతం కుప్పకూలాయి. దీంతో సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే ఇబ్బందుల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలు అందించారు. దీంతో శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేను అభినందించారు. ప్రశంసపత్రం అందజేశారు.



సీఎం చేతులు మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న ఎమ్మెల్యే కొండయ్య

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం స్టూవర్టుపురం - బాపట్ల రైల్వే స్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. దీంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతునికి సుమారు 35 సంవత్సరములు ఉంటాయని, కుడి చేతిపై మామ్, డాడ్ అని, ఎడమ చేతిపై నేహా అని పచ్చబొట్టు ఉన్నట్లు చెప్పారు. వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

పంగులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమూరు గ్రామ సమీపంలో మొంథా తుపాను తాకిడికి విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ నేలపై పడిపోయింది. దీంతో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 5 విద్యుత్ మోటార్లకు విద్యుత్ సరఫరా అందుతోంది. సమస్యను గుర్తించి సంబంధిత అధికారులు తిరిగి పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



కొండమూరు గ్రామ సమీపంలో నేలవాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు1(ఆంధ్రజ్యోతి):కార్తీక శుక్ల ఏకాదశి (చిలుక ఏకాదశి) సందర్భంగా శనివారం యద్దనపూడి మండలంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో చెన్నయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారిని ఏకాదశిన ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు అష్టాదశోధ్యాయ భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.



విశేష అలంకరణలో చెన్నయ్య స్వామి



శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవుడు

కనులపండువగా చెన్నయ్య శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం శనివారం కనులపండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ఉదయం అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవర్లను ఆలయ మధ్యరంగ మండపంలో కల్యాణ వేదికపై శోభాయమానంగా అలంకరించి ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల జై చెన్నకేశవ నామస్మరణ మధ్య కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు చెన్నయ్య తెప్పోత్సవం

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి తెప్పోత్సవం ఆదివారం సాయంత్రం జరగనుంది. చిలుక ఏకాదశిని పురస్కరించుకుని చెన్నకేశవస్వామికి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కోనేరులో స్వామికి తెప్పోత్సవం నిర్వహిస్తారని భక్తులందరూ దర్శించుకోవాలని కోరారు.



పింఛను అందజేస్తున్న మంత్రి స్వామి

అభివృద్ధి, సంక్షేమం పరుగు

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- టి.నాయుడుపాలెంలో పింఛన్‌ల పంపిణీ

టంగుటూరు (కొండపి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ పరుగులు పెడుతున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు పింఛన్ నగదును పెంచి ఠంచన్‌గా అందజేస్తున్నారన్నారు. మంత్రి తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో శనివారం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదలంతా క్షేమంగా, సంతోషంగా ఉండాలన్నదే సీఎం ఆశయమన్నారు. మొంథా తుఫాన్ సమయంలో ప్రాణ నష్టం జరగకూడదని చంద్రబాబు అహర్నిశలు సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారన్నారు. ప్రజా ప్రభుత్వం చురుగ్గా పనిచేయడం వల్లనే ప్రాణ నష్టం తగ్గిందన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఎంపీడీవో దేవసేనకుమారి, తహసీల్దార్ ఆంజనేయులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం రామారావు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి

- ఆర్ఎం రామారావు

కొండపి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని వ్యాపారులకు బోర్డు ఒంగోలు ఆర్ఎం శీలం రామారావు సూచించారు. శనివారం ఆయన కొండపి వేలం కేంద్రంలో కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం వ్యాపారులు, పచ్చవ గ్రామ రైతులతో సమావేశమయ్యారు. మార్కెట్‌లో అమ్ముడు పోని బేళ్లను పదేపదే వేలానికి తీసుకురావద్దని రైతులను కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో నారుమడుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వేలం కేంద్రం సిబ్బందితో సమావేశమై వారి పనితీరును సమీక్షించారు. రైతులకు జవాబుదారీతనంగా ఉంటూ పారదర్శకంగా పనిచేయాలన్నారు. సమావేశంలో వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సాయం చేస్తామని రైతులకు భరోసా

కలెక్టర్ రాజాబాబు

పెద్ద దోర్నాల,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలకు నివారణ చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజాబాబు రైతులకు తెలిపారు. కలెక్టర్ టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి శనివారం పర్యటించారు. ఈ క్రమంలో గంటవానిపల్లె గ్రామం వద్ద తుఫాన్‌కు కొట్టుకుపోయిన తీగలేరు కాలువపై నిర్మించిన చప్టాను పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించారు. బ్రిడ్జి పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి రాకపోకలకు చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కటకానిపల్లె గ్రామంలో పొలాలను పరిశీలించేందుకు వెళ్లగా అనువుగా లేకపోవడంతో డ్రోన్ ద్వారా తిలకించారు. గ్రామానికి చెందిన టీడీపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు రావెళ్ల సత్యానారాయణ ఫీడర్ కెనాల్‌కు గండ్లు పడడంతో వరద నీటి ఉధృతికి పంటలు పాడవడమే గాక సారవంతమైన మట్టి కొట్టుకుపోయి పెద్ద రాళ్లు చేరాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చాలా ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామని, రైతులు అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈలు రాజ్యలక్ష్మి, అబూత్‌ఆలి, డీఏవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఏవో జవహర్ లాల్ నాయక్, ఈవో శివ కోటేశ్వరరావు, ఎంఈవో మస్తాన్ నాయక్, విద్యుత్ ఏఈ భీమా నాయక్, అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్‌మాబు, నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి పాల్గొన్నారు.



కంభం చెరువు గురించి కలెక్టర్ రాజాబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో కలిసి కంభం చెరువు పరిశీలన

కంభం : మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, తుఫాన్‌ల వలన నష్టపోయిన వారందరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కలెక్టర్ రాజాబాబు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి కంభం చెరువు అలుగును ఆయన సందర్శించారు. చెరువు అలుగు నుంచి పారుతున్న వరద నీటి ఉధృతిని పరిశీలించి అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో చారిత్రాత్మక కంభం చెరువు, గుండ్లకమ్మ రిజర్వాయర్‌తో సహా ప్రధాన ఐదు రిజర్వాయర్లు పూర్తి స్థాయిలో నిండాయన్నారు. అధికారులందరూ సమన్వయంతో సమర్థంగా పనిచేయడంవల్ల ప్రాణ నష్టాన్ని నివారించగలిగామన్నారు. నియోజకవర్గంలో జరిగిన నష్టంపై అధికారులతో చర్చించి వివరాలను ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉటుందన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో పంటలతో పాటు రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయని, ఇళ్లు కూడా కూలాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో బాధితులను ఆదుకోవడంలోనూ అంతే వేగంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వరదకు కొట్టుకుపోయిన గంటవానిపల్లె బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు

- స్త్రీ శక్తి ద్వారా మహిళలకు రూ. 30 కోట్లు లబ్ధి
- పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు
- మీడియా సమావేశంలో ఆర్ఎం సత్యనారాయణ వెల్లడి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా జిల్లాలోని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ప్రకాశం రీజియన్ మేనేజర్ సత్యనారాయణ వెల్లడించారు. శనివారం ఒంగోలులోని ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని ఐదు డిపోల నుంచి 485 సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించారు. కాగా రోజూ లక్షా 90 వేల మంది ప్రయాణిస్తుండగా, అందులో అత్యధికంగా 90 శాతం మంది మహిళలే ఉచితంగా ప్రయాణ పథకాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఆగస్టు 15న రాష్ట్రప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించగా శనివారం నాటికి 75 రోజులు అయినట్లు తెలిపారు. కాగా ఇప్పటి వరకు జిల్లాలోని మహిళా ప్రయాణికులకు రూ. 30 కోట్ల లబ్ధి చేకూరిందని ఆయన వివరించారు. అలాగే మొంథా తుఫాన్ ప్రభావంతో కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో సిబ్బందిని అప్రమత్తం చేసి, ఎక్కడా ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా, బస్సులు నీట మునగకుండా సమర్థవంతంగా పనిచేశామన్నారు. అందుకు ఆర్టీసీ డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర టెక్నికల్ సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని ఐదు ప్రధాన ఆర్టీసీ డిపోలలో మౌలిక వసతుల కల్పన, ప్రతి రెండు గంటలకు ఒకసారి మరుగుదొడ్ల పరిశుభ్రత, ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు బస్సుల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. 2022 నుంచి సిబ్బందికి రావలసిన స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌లు 811 మందికి అందించామన్నారు. అలాగే జిల్లాలోపర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా కొత్తపట్నం, పాకల బీచ్‌లకు ప్రత్యేక బస్సులు, అలాగే కార్తీకమాసం పురస్కరించుకుని అన్నీ దైవ పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆర్ఎం పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ ప్రకాశం జిల్లా, కనిగిరి మండలం పోస్టు, పునుగోడు గ్రామం సంగిని అంకిరెడ్డి గారి సంజాయిషీ మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని నా క్లయింటు తేది.27-04-1998 డాక్యుమెంట్ నెం.646/1998న సంగిని నాగిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి గారి ద్వారా రిజిష్టరు చేసుకొని యున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన జెరాక్స్ తీయించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. సదరు మా క్లయింటు పోలీసు వారికి రిపోర్టు చేసి తద్వారా సర్టిఫికేట్ పొందియున్నారు. కాగా ప్రస్తుతం నా క్లయింటు సదరు ఆస్తికి సంబంధించి సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ కోడ్ 4497 కందుకూరు శాఖ నందు ఋణము పొందగోరుచున్నారు. కావున నా క్లయింటు సదరు ఆస్తిని తనఖా పెట్టి సదరు బ్యాంకు నుండి ఋణమును పొందుటకు ఎవరికైనను ఎట్టి అక్షేపణలు ఉన్నయెడల 15 రోజులలోగా క్రింది తెలిపిన అడ్రస్సు నందు తగిన ఖచ్చితమైన ఆధారములతో వ్రాతపూర్వకముగా తెలియపరచగలరు.

షెడ్యూలు

ప్రకాశం డి కనిగిరి సబ్.డి.కనిగిరి మండలం, పునుగోడు పంచాయతీ ఏరియాలో చేరిన పునుగోడు గ్రామంలో సర్వే నెం.412బు య.10.56 సెంట్లలో వృష్టిన య.2.40సెంట్ల భూమి గల స్థలం పైరాలకు హద్దులు : **తూర్పు** : మంత్రవాసి రామసాయి గారి భూమి, **దక్షిణం** : నా తాలూకు భూమి, **పడమర**: చెందుకూరి విజయ్‌కుమార్ గారి భూమి, **ఉత్తరం**: చెందుకూరి విజయ్‌కుమార్ గారి భూమి.

ఇట్లు : **రాజేంద్రబాబు.జె,** న్యాయవాది, కందుకూరు, సెల్: **9848915273**

మండుతున్న కూరగాయల ధరలు

- భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న తోటలు
- కిలోకు రూ. 10 నుంచి 20 వరకు పెరుగుదల
- కిలో రూ. 100 దాటిన పెద్ద చిక్కుళ్లు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో పండ్ల తోటలు ధ్వంసం కావడంతో వాటి ధరలు అమాంతంగా పెరిగాయి. అక్టోబరు మధ్యలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న కూరగాయాల ధరలు గత పది రోజుల నుంచి వాటి ధరలు చుక్కలుచూపిస్తున్నాయి. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో విస్తారంగా నాలుగురోజుల పాటు వర్షాలు కురిశాయి. ఆ సమయంలో కొంత మేర పంటలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత మొంథా తుఫాన్ ప్రభావంతో కుండపోత వర్షం కురియగా పంట పొలాలు కూడా వర్షపునీటితో చెరువులను తలపించాయి. దీంతో అనేక ప్రాంతాల్లో కాయగూరల తోటలు పూర్తిగా దెబ్బతినడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో టమోటా, పచ్చిమిర్చి పశ్చిమ ప్రాంతం నుంచి ఒంగోలుకు భారీగా దిగుమతి అవుతోంది. అయితే ఆ ప్రాంతంలో పంట వచ్చే సమయంలో వర్షాలు కురియడంతో ఆ తోటలు దెబ్బతిని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కొత్తపట్నం, మా ర్టూరు ప్రాంతాల నుంచి వచ్చే పలు రకాల కూరగాయల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో వాటి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వర్షాలకు ముందు టమోటా కిలో రూ.20 నుంచి రూ.25 వరకు పలుకగా ప్రస్తుతం కిలో రూ.50కి చేరగా, పచ్చిమిర్చి వర్షాలకు ముందు కిలో రూ.25 నుంచి రూ.30 వరకు ఉండగా ప్రస్తుతం కిలో రూ.55 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. ఇక పెద్ద చిక్కుళ్లు అయితే చికెన్ ధరలతో పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం పెద్ద చిక్కుళ్లు కిలో రూ.110 నుంచి రూ.120 వరకు పలుకుతుండగా మిగిలిన అన్ని రకాల కూరగాయాల ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం వచ్చే కూరగాయాలు కూడా వర్షాలకు దెబ్బతినడంతో ఒక్కరోజు కూడా నిల్వ ఉండని పరిస్థితి ఏర్పడింది. సామాన్య ప్రజానీకం అధికంగా వినియోగించే టమోటా, పచ్చిమిర్చిని పావు కిలో చొప్పున కొనుగోలు చేయాలంటే పావుకిలో రూ.20 వరకు వినియోగిస్తున్నారు. ఆలా అన్ని రకాల కూరగాయాల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం ఏ కూరగాయాలు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఒంగోలులో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి.



టమోటా	50.00
పచ్చిమిర్చి	60.00
బీర	70.00
పెద్దచిక్కుళ్లు	120
చిన్న చిక్కుళ్లు	70.00
దొండ	60.00
కాకర	60.00
బంగాళాదుంప	40.00
బెండ	50.00
క్యారెట్	80.00
క్యాప్సికం	80.00
వంకాయలు	70.00
బీట్‌రూట్	55.00
దోసకాయలు	40.00

అవినీతి రహిత సమాజంలో భాగస్వాములు కావాలి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో పని చేసే ఉద్యోగులు పారదర్శకంగా, విలువలతో విధులు నిర్వహించాలన్నారు. విజిలెన్స్ సీఐ బీటీ.నాయక్ మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు. అనంతరం ఎస్ఈ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఈ ఎం.హరిబాబు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సుబ్బారావు, అధికారులు



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించిన బాపట్ల ఎంపీ

మద్దిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మల్లవరం సమీపంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టును శనివారం సాయంత్రం బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో వరద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధి పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పొగాకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, నవులూరి శివకృష్ణ, మండవ గోపీనాథ్, ముల్లూరి మురళి, రెబ్బవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు కామేపల్లి విద్యార్థుల ఎంపిక

జరుగుమల్లి (కొండపి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-17 రెజ్లింగ్ పోటీలకు కామేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో ఎం.పౌల్రాజ్, కె.పవన్‌కుమార్, విజయ్‌కుమార్, బాలచందర్, పి.సాయిజగదీష్ ఉన్నారు. శనివారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం ఎల్.అనూరాధ, వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు అభినందించారు.



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

ఒంగోలు క్రైం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శనివారం రాత్రి ఒంగోలు నగరంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కర్నూలు రోడ్డు కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం వీరజవాన్ స్థూపం వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. అదేవిధంగా వీరజవాన్ స్థూపం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు బ్యాండ్‌షో నిర్వహిచారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, విజయకృష్ణ, శ్రీకాంత్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారుల ఎంపికలను పరిశీలించిన డీఈవో

కొత్తపట్నం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 69వ స్కూలు గేమ్స్‌కు సంబంధించిన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ శనివారం ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించిన రగ్బీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించగా డీఈవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. రగ్బీ జిల్లాస్థాయి అండర్-14, 17 క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఇక్కడ చేపట్టారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఈవో ముచ్చటించారు. క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 200ల మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరిలో అండర్-14 టీంకు 15 మందిని, అండర్-17 టీంకు 15మందిని జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేశారు. అనంతరం డీఈవో కిరణ్‌కుమార్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో పీఎంశ్రీ నిధులతో చేపడుతున్న నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ చక్కా వెంకటేశ్వర్లు, రగ్బీ జిల్లా సెక్రటరీ చంద్ర, ఈతముక్కల ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య, ఉపాధ్యాయులు శివయ్య, చెన్నకేశవులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండ

● బీజేపీ రాష్ట్ర సెల్స్ రాష్ట్ర కో కన్వీనర్



నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న సూర్యకళ్యాణ్ చక్రవర్తి, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కృషి చేస్తామని బీజేపీ సెల్స్ రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. శనివారం పొదిలి, కొనకనమిట్ల మండలాల్లోని మునగపాడు, నాగరాజుకుంట గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ, మిర్చి, కంది, మినుము తదితర రకాల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతిరైతుకు ఫసల్‌బీమా, రాష్ట్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ ద్వారా ఆదుకుంటాయని, అందువల్ల రైతులు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, మాకినేని అమరసింహం, రాయపాటి అజయ్, బెల్లంకొండ విజయలక్ష్మి, రాజేష్‌వర్మ, మన్నం సురేష్, రమణారెడ్డి, కల్లంసుబ్బారెడ్డి, కిలారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



కందులూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్

టంగుటూరు (కొండపి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందులూరు, ఎం.నిడమ లూరు పాఠశాలలను కందుకూరు డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మూల్యాంకన పత్రాలు, స్కూళ్ల రికార్డులు, ఉపాధ్యాయుల ప్రణాళికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తన్నీరు బాలాజీ, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, శ్రావణ్, బాలాజీ పాల్గొన్నారు.

దీక్షాధారులకు భిక్ష ప్రారంభం



భిక్షలో పాల్గొన్న దీక్షాదారులు

సంతనూతలపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో త్రిపురాంతకస్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప, భవానీ, శివ తదితర దీక్షలు ధరించిన స్వాముల కోసం గురుస్వామి కె.శ్రీనివాసరావు, భక్తబృందం ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత 22 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో ఈ భిక్ష కార్యక్రమం చేపడుతున్నారు. కార్యక్రమంలో తన్నీరు ఏడుకొండలు, జడ్పీటీసీ డి.రమణమ్మ, స్వాములు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు



అమ్మనబ్రోలులో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

నాగులుప్పలపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నీటి విడుదలతో మండలంలోని మద్దిరాలపాడు, చదలవాడ, పాత, ఏటిఒడ్డు చీర్వానుప్పలపాడు, వినోదరాయునిపాలెం, కేశినేనివారిపాలెం, ఈదుమూడి, మట్టిగుంట, ఎం.ముప్పాళ్ళ, మద్దిరాలపాడు, తిమ్మసముద్రం తదితర గ్రామాలు వరద ముంపలో చిక్కుకున్నాయి. మిగిలిన గ్రామాలలోనూ వరద చుట్టుముట్టింది. దాంతో ఆయా గ్రామాల్లో వరదనీరు వెళ్లి పోవడంతో బురద, ఇతర వ్యర్థాలు రోడ్లు, నివాస గృహాల వద్ద పేరుకుపోయాయి. ఈక్రమలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారి జి.జోసఫ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ళ రవికుమార్ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను చేపట్టారు. చదలవాడ ఎస్టీకాలనీ రోడ్లపై పేరుకుపోయిన బురదను ట్రాక్టర్ డోజరులతో తొలగించారు. అలాగే గ్రామంలోని సైడుకాలువలలో పేరుకున్న వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు.



చదలవాడ ఎస్టీకాలనీలో బురదను తొలగిస్తున్న డోజర్

ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో ఆసరా



సీతారాంపురం కొష్టాలులో పింఛను నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్



ఉప్పుగుండూరులో పింఛన్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

● గ్రామాల్లో కోలాహలంగా పంపిణీ

మద్దిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో వృద్ధులు, వితంతువులకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మద్దిపాడు మండలం సీతారాంపురం కొష్టాలులో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులకు పెన్షన్ ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. రాష్ట్ర పొగాకు సమైఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ అర్హులైన వృద్ధులు సచివాలయంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ఎంపీడీవో జ్యోతి, ముల్లూరి సర్పంచ్ మండవ శివానందరావు, సీతారాంపురం గ్రామ అధ్యక్షుడు మండవ కోటేశ్వరరావు, మారెళ్ల హరికుమార్, రెబ్బవరపు ప్రభాకర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం కోలాహలంగా జరిగింది. మండలంలో అధికారులు, కూటమి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఉప్పుగుండూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, కుంచాల నాగరాజు, మసిముక్కు భాస్కరరావు, మిండాల శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శ్రీను, శ్రీకాంత్, కొప్పర్తి నాగేశ్వరరావు, బెల్లం శ్రీను, కొంజేటి రామకృష్ణ, జాలాది సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్థాన ఏకాదశి పూజలు



సంతపేట బాబా ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు



చెన్నకేశవ ఆలయంలో ఏకాదశి విశిష్టితను వివరిస్తున్న అర్చకుడు

● ఆలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉత్థాన ఏకాదశి పండుగను ప్రజలు శనివారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు వైష్ణవాలయాలలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇక ఒంగోలు నగరంలోని కేశవ స్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, కలశారాధన, రమా సహిత సత్యనారాయణ స్వామి వారికి అభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, వ్రత కథా శ్రవణం మొదలైన కార్యక్రమాలు జరిగాయి. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అటు స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో సైతం ఏకాదశి వ్రతాలను ఘనంగా నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం, శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, కొత్తపట్నం రోడ్డులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మొదలైన పలు వైష్ణవాలలో ప్రత్యేక పూజలు జరిగాయి.

మల్లవరంలో గిరి ప్రదక్షిణ

మద్దిపాడు: ఉత్థాన ఏకాదశి సందర్భంగా శ్రీవారి వనం కమిటీ ఆధ్వర్యంలో మల్లవర గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతి నెలా శుక్ల పక్ష ఏకాదశి రోజున గిరి ప్రదక్షిణ నిర్వహించాలని నిర్ణయించారు. గోవింద నామ బృందం సభ్యులు బోయపాటి సుబ్బారావు, కనపర్తి శారద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణ చేశారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. శ్రీవారివనం కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, ప్రధానకార్యదర్శి బోయపాటి రవి, కోశాధికారి మన్నం శ్రీనివాస్, సభ్యులు మార్నేని సుబ్బారావు, కారుమూడి చిన్నవెంకటేశ్వర్లు, నన్నపనేని కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆవుతో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

● నివాళులర్పించిన పలు పార్టీలు, సంఘాలు



ఒంగోలులోని జిల్లా గ్రంథాలయలో నివాళులర్పిస్తున్న అతిథులు, పాఠకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ అధ్యక్షత ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ హాజరయ్యారు. అదేవిధంగా ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతిని సైతం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, కృష్ణశాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత బంతికట్ల నాగేశ్వరరెడ్డి, నాగలక్ష్మి, టి.గోవిందమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

ఒంగోలు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము దగ్గర ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పలివేటి పవన్, కోశాధికారి వేముల తిరుమల, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ సెక్రటరీ కొప్పురావూరి సురేష్, పల్లపోతు వెంకటేశ్వర్లు, కొల్లిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగంచేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకులు కుప్పం ప్రసాద్, డీఎస్.క్రాంతికుమార్, కటారి శంకర్, బొట్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేఎంసీ ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బీజేఎంసీ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా బాషా, షేక్ సిద్దాంబీ, సంపూర్ణ, కూకట్లపల్లి జయరాజ్, కరాటే కోచ్ షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని శనివారం చీమకుర్తి పట్టణంలో జిల్లా ఆర్యవైశ్యసంఘ ఉపాధ్యక్షులు శిద్దా సుధాకర్ ఘనంగా నివాళి అర్పించారు. గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చలువాది పార్థసారధి, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, రంగా, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం అందజేత



చదలవాడలో సాయం అందజేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



పీర్లమాన్యంలో నగదును అందిస్తున్న అధికారులు, నాయకులు

నాగులుప్పలపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వరద ముంపునకు గురైన పలు గ్రామాల బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని తహసీల్దార్ కె.ప్రవీణ్ కుమార్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం అందజేశారు. చదలవాడ, రావర్ల, నాగులుప్పలపాడు గ్రామాల్లోని వరద బాధితులకు నగదుతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండల పరిధిలో 320 కుటుంబాలు వరద ముంపునకు గురైనట్లు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అందుకు గానూ బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు రూ.6,60,000 విడుదల చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

పీర్లమాన్యం పరిధిలో

సంతనూతలపాడు: పేర్నమిట్టలోని పీర్లమాన్యం పరిధిలో గల క్విస్ హైస్కూల్లోని 109 మంది నిర్వాసితులకు శనివారం రూ.2.87లక్షలు పరిహారం, నిత్యావసరవస్తువులు, కూరగాయలను టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు ఆరికట్ల సుమతి, జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు, మండలస్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి, తహసీల్దార్ నారాయణరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఆర్ఐ రామ్‌తేజ పాల్గొన్నారు.

కేవీపాలెం రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

● కూలిపోయే దశలో ఉన్న కరెంట్ స్తంభం

చీమకుర్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం నుంచి చీమకుర్తికి వచ్చే ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. తీగలతో ఉన్న కరెంట్ స్తంభం రోడ్డు పైకి వంగిపోయి ఏ నిమిషాన్నైనా కింద పడే స్థితిలో ఉంది. ఈ రహదారిపై నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ కరెంట్ స్తంభం స్థితి చూసిన ప్రజలు భయభయంగా ప్రయాణం చేస్తున్నారు. ఎవైనా ప్రమాదం జరగక ముందే స్తంభాన్ని సరిచేయాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు కాగా ఈ విషయమై కేవీపాలెం నాయకులు విన్నవించుకుంటున్నా విద్యుత్ సిబ్బందిలో చలనం లేకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

ఆర్ఈఎంఎస్ స్కీమ్ పునరుద్ధరణపై హర్షం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్ఈఎంఎస్ స్కీమ్ పునరుద్ధరణపై ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర కమిటీ కృషి మేరకు ఈ స్కీమ్ పునరుద్ధరణ జరిగిందని జోనల్ జాయింట్ సెక్రటరీ బెజవాడ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ విలీనం అనంతరం నిలిపివేసిన రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ స్కీమ్ అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. 2020 సంవత్సరానికి ముందు పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఈ స్కీమ్ నిలిపివేయగా కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం హర్షణీయమని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం 14న నిరాహారదీక్ష

ఒంగోలు విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 136 ఎయిడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14వ తేదీన నిరాహారదీక్ష చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థులకు 1నుంచి 8వతరగతి సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్, తరల్ కిట్లు, 67 రకాలస్పోర్ట్స్ మెటీరియల్ ఇస్తున్నారని తెలిపారు. కానీ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆ కిట్లు అందడం లేదన్నారు. ఆయా కిట్లను విద్యార్థులకు అందించాలని కోరుతూ ఈ దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

5న అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం

ఒంగోలు కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీన కార్తీకమాస ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి శనివారం తెలిపారు. 4వ తేదీ సాయంత్రం అంకురార్పణ, ఉక్తహోమం జరుగుతాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా 5వ తేదీన ఉదయం కుంభపూజ, పూర్ణాహుతి, 9.30కు అష్టోత్తర శతసహస్ర కలశాభిషేకం, సాయంత్రం కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు. కనుక భక్తులు పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

14న నాయీబ్రాహ్మణ వన సమారాధన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర క్షౌరశాలల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నాయీబ్రాహ్మణ కార్తీకమాస వన సమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం స్థానిక శ్రీప్రసన్నచెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలు-కందులూరు మధ్యలో ఉన్న వీఆర్ఎన్‌కే గ్రీన్ సిటీలో ఉదయం 7.30 నుంచి కార్యక్రమాలు భారతుల శ్రీనివాసశర్మ యాజ్ఞీకంలో జరుగుతాయన్నారు. గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శాంతి కళ్యాణ మహోత్సవం ఉంటాయన్నారు. కనుక నాయీబ్రాహ్మణులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని వారు కోరారు.

మొంథా బాధితులకు ఆర్పీల చేయూత



కాలనీవాసులకు సరుకులను అందజేస్తున్న ఆర్పీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నగర శివారుకాలనీలు నీట మునగడంతో బాధితులకు మెప్మా ఆర్పీలు సహకారం అందించారు. ఈ మేరకు శనివారం నగరంలోని కేశవరాజు కుంట, బిలాల్‌నగర్, బలరాంకాలనీలలోని ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, వంట నూనెతోపాటు పలు సరుకులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ముప్పు తప్పిందని, అయితే కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు కలిగినా అధికారులు తగు చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందని ఆర్పీల సంఘం నాయకురాలు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవయాని, లక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

రైజ్‌లో అవగాహన సదస్సు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం అవినీతి నిర్మూలన అంశంపై సదస్సును విజిలెన్స్ అధికారులు, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మంచి మార్గం ఎంచుకునే అవకాశం ఉంటుందని రాగ చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక తెలిపారు. కార్యక్రమంలో గౌరవ చైర్మన్ ఇస్కాల రంగ మన్నార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వాటర్ ట్యాంకులో క్లోరినేషన్‌ను పర్యవేక్షిస్తున్న డీఎల్పీవో పద్మ, అధికారులు

టంగుటూరు (కొండపి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్పీవో ఆర్.పద్మ ప్రజలకు సూచించారు. శనివారం టంగుటూరు, జమ్ములపాలెం గ్రామాల్లో ఆమె పర్యటించారు. నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని నివాసితులను కోరారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పలు స్కూళ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పలు రక్షిత పథకాల ట్యాంకుల్లో క్లోరినేషన్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న అధికారులు

సంతనూతలపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని మద్దులూరు, మాచవరం గ్రామాల మధ్య ఇనగలేరు వాగు పొంగి ఆర్ అండ్‌బి రోడ్డు దెబ్బతింది. ఈక్రమంలో శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు శనివారం మరమ్మతులు ప్రారంభించారు. నాలుగైదు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు నువ్వుల మీరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పింఛన్‌తో ఆర్థిక భరోసా



పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



గొర్లగడ్డలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల



వైపాలెంలో పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ చేకూరి, ఉద్యోగులు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఎన్టీఆర్ పింఛన్ పథకం ఆర్థిక భరోసాను ఇస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనుములవీడు గ్రామంలో శనివారం ఆయన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలన అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు. టీడీపీ నాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అశోక్‌రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, కార్యదర్శి గణేష్, వీఆర్వో బి కిషోర్‌కుమార్, సర్పంచ్ పల్నాటి లతీఫ్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కె యోగానంద్, రాచర్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ జీవనేశ్వర్‌రెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బి బాలయ్య, వైస్ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, జిల్లా బీసీ సెల్ నాయకులు ఎన్ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నాయకులు వై సంజయ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చప్పిడి శ్రీనివాసరావు, పి ఆంజనేయులు, ఎస్సీసెల్ నాయకుడు టి దివాకర్, జనసేన పార్టీ నాయకుడు శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఆలస్యం లేకుండా పింఛన్ : ఎమ్మెల్యే కందుల

మార్కాపురం : ప్రజా ప్రభుత్వంలో పేదలకు ప్రతి నెలా 1వ తేదీన ఎలాంటి ఆలస్యం లేకుండా వేకువజామునే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 8వ వార్డులోని గొర్లగడ్డలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా పేద ప్రజల కోసం ఎలాంటి ఆలస్యానికి తావులేకుండా పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మీరావలి, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్, షేక్ మౌళాలి, వార్డు టీడీపీ నాయకులు షాకీర్‌హుసేన్, జాబీర్, వలి, పఠాన్ హుసేన్‌ఖాన్, గులాబ్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : వృద్ధులకు సంతోషాన్ని ఇవ్వాలన్నదే చంద్రబాబు ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు అన్నారు. స్థానిక వార్డులలో ఆయనతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య ఇంటింటికీ తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను శనివారం పంపిణీ చేశారు.

రాచర్ల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మొదటిరోజే 95%మేర పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన కాలువపల్లి పంచాయతీలో పెన్షన్‌లను సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. అందుబాటులో లేని వారికి సోమవారం పంపిణీ చేస్తారని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, టీడీపీ నాయకుడు ముత్తుముల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రూ.8వేల పింఛన్ అందజేత



కంభంలో పెన్షన్‌ను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కంభం : కంభం మండలంలో ఇద్దరికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సొంత నిధుల నుంచి రూ.8 వేలు పెన్షన్‌ను టీడీపీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి గోన చెన్నకేశవులు మాట్లాడుతూ కంభం అర్బన్ కాలనీకి చెందిన రాచ మల్లు కృష్ణ, తెలుగు వీధికి చెందిన పీ లోకేష్ అనే దివ్యాంగుడికి పింఛన్ రావడం లేదు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వారికి పింఛన్ మంజూరయ్యే వరకూ తానే ఇస్తానని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రతి నెలా 1వ తేదీన అందరితోపాటు వారికి కూడా పింఛన్‌ను అందజేస్తున్నట్లు చెన్నకేశవులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తుఫాన్ బాధితులకు బియ్యం, ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండ

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా పనులకు వెళ్లలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలిచిందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో పునరావాస బాధితులకు బియ్యం, ఆర్థిక సాయాన్ని ఎరిక్షన్‌బాబు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరదృష్టి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో ముందు జాగ్రత్త చర్యలతో తుఫాన్ నుంచి ప్రాణనష్టం లేకుండా, ప్రజలు ఇబ్బంది పడకుండా గట్టెక్కామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఈవో శివ కోటేశ్వరరావు, ఎంఈవో మస్తాన్ నాయక్, ఏవో జవహర్‌లాల్ నాయక్, సర్పంచ్ చిత్తూరి హారిక, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు, నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, పబ్బతి సుబ్బారావు, కటికల శ్రీనివాసులు, దర్శనం దేవయ్య, ఒంటేరు రాఘవ, ఐటీడీపీ బాబు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసులు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

పెద్దారవీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వడ్డమాని శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.శ్రీనివాసులుకు డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు పెద్దారవీడుకు బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో జాన్ సుందరంను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణలకు అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అర్థమయ్యేలా బోధించాలి



విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో

రాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవోలు షేక్ మొయినుద్దీన్, వీ గిరిధర్‌శర్మ అన్నారు. మండలంలోని అనుములవీడు మెయిన్, స్పెషల్ ఎంపీపీ పాఠశాలలను శనివారం వారు సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేసి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

తర్లుపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ అచ్యుత్ సుబ్బారావు తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, హాజరు పట్టిలను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు చదువులో రాణిస్తుండటంతో ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

కంభం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని ఎంప్లాయీస్ నగర్‌లో పలు అంతర్గత రోడ్లలో ప్రజలు రాకపోకలు సాగించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో పలు గ్రామాలలోని ప్రధాన అంతర్గత రహదారులు నేటికీ మట్టి రోడ్లు కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయం అవుతుంది. వాహనాలు వెళ్ళినా, నడిచినా జారి కిందపడి గాయాలపాలు కావాల్సి వస్తుంది. పంచాయతీ అధికారులు స్పందించి రహదారుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి

పొదిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఒంగోలు-కర్నూలు ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా రహదారికి ఇరువైపులా ఉన్న షాపుల యజమానులు మట్టి తోలడంతో రోడ్డుపై నీరు నిలిచి ఛిద్రమవుతుందని వాహనచోదకులు వాపోతున్నారు.

మార్కాపురం అడ్డరోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్, పాత పోస్టాఫీసు ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహన ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. వీటిపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రావణిని వివరణ కోరగా రహదారిని పరిశీలిస్తున్నామని ఎస్టిమేషన్ తయారు చేసి సీసీ రోడ్లకు నివేదిక పంపిస్తామని అన్నారు.

కంభంలో కొలిక్కిరాని ట్రాఫిక్ సమస్య

వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు

కంభం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంభం పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్నది. ఆక్రమణలతో ప్రధాన రహదారులు కుంచించుకుపోవడం, కొందరు వ్యాపారులు తమ షాపుల్లోని వస్తువులను మార్జిన్‌లలో ఉంచుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ విషయమై పలువురు పోలీసులకు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి ఏ ఒక్కరూ దృష్టి సారించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మెయిన్ బజార్, చౌక్ సెంటర్లలో ట్రాఫిక్ సమస్యకు ఏళ్లతరబడి పరిష్కారం దొరకడం లేదు. కందులాపురం కూడలి నుంచి ప్రారంభమయ్యే ప్రధాన రహదారి 30 నుంచి 40 అడుగులు వెడల్పు ఉండగా, చౌక్ సెంటర్‌కు వచ్చే సరికి 10 నుంచి 15 అడుగులకు పరిమితం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెయిన్‌బజార్‌లో హోల్‌సేల్, కిరాణా షాపులు ఉండడంతో ఉదయం వేళ ఈ దుకాణాలకు సరుకులు దింపేందుకు లారీలు వస్తుంటాయి. ఆ సమయంలో పాదచారులు, సైకిల్‌పై వెళ్లే వారికి కష్టంగా మారింది. ఇదే మార్గంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 35పైగా వివిధ పాఠశాలల బస్సులు తిరుగుతుంటాయి. ఆ సమయంలో ట్రాఫిక్ అక్కడే నిలిచిపోతుంది. చౌక్ సెంటర్ ప్రాంతంలోనే పాత పోలీస్ స్టేషన్‌ను ఆధునీకరించి సీఐ కార్యాలయం ఏర్పాటు చేశారు. నిత్యం ఆ మార్గంలో పోలీసు అధికారులు తిరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. గతంలో ఒకటి, రెండు పర్యాయాలు రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి ఆక్రమణల హద్దులు గుర్తించినా, పోలీసులు ఈ హద్దులకు అవతలనే షాపులు ఉండాలని హెచ్చరించినా పెడచెవిన పెట్టిన ఆక్రమణదారులు యథేచ్ఛగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వాహనాలు నడిపేవారు మద్యం సేవించారా లేదా అని పరిశీలించి జరిమానా విధించే పోలీసు వారు ట్రాఫిక్ సమస్యను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కంభం, కందులాపురం పంచాయతీలలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

జిల్లా స్థాయి పోటీలకు దోర్నాల విద్యార్థులు

పెద్ద దోర్నాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి యోగా, చదరంగం పోటీలకు దోర్నాల విద్యార్థులు ఎంపికయినట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాం ప్రసన్నతాంజలి తెలిపారు. పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 31న మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి పోటీలు జరిగాయి. అండర్-71 విభాగం యోగాలో దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పీ వీరాంజనేయులు, చరణ్, ఎం స్వాతి, చదరంగంలో వంశీ మాధవ్, అండర్-14 విభాగం యోగాలో గణేశ్, ఎం శివకాశీ కృష్ణవేణిబాయి, అభినయశ్రీ, లావణ్య చదరంగంలో రిహాన్‌బేగ్ ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 2వ తేదీన ఒంగోలులో ఓరియంటల్ స్కూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఆ పోటీల్లో కూడా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు హెచ్‌ఎం, సిబ్బంది అభినందించారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో షేక్ మహబూబ్‌బాషా

రాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌కు శనగ విత్తనాలు కావాలని డబ్బులు చెల్లించి పేర్లు నమోదు చేసుకున్న అనుములపల్లి రైతులకు 25శాతం సబ్సిడీపై 300క్వింటాళ్ల శనగ విత్తనాలు శనివారం పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. విత్తనాలు కావాలని డబ్బులు చెల్లించి పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగిరి రమేష్, టీడీపీ నాయకులు శిరిగిరి వెంకటపతి, భూపని కాశయ్య, పాపిశెట్టి శ్రీనివాసులు, శివ పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

రాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. చెత్త సేకరణ, దాని తరలింపు కోసం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన నూతన ట్రాక్టర్‌ను శనివారం ఆయన అనుములవీడు సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. చెత్తను తరలించేందుకు సచివాలయాలకు ట్రాక్టర్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో రాచర్ల, ఆకవీడుకు ట్రాక్టర్ మంజూరు కాగా రెండ విడతలో చోళవీడు, అనుములవీడుకు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, ఈవోఆర్‌డీ ఐ వెంకటేష్, కార్యదర్శి గణేష్, వీఆర్వో బీ కిషోర్ కుమార్, సర్పంచ్ పల్నాటి లతీఫ్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

మార్కాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని పలువురికి శనివారం ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి పంపిణీ చేశారు. మొత్తం 14 మందికి రూ.6.59లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. నియోజకవర్గ పరిధిలో వేలాదిమంది ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వసంతలక్ష్మి

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణోత్సవం

పొట్టి శ్రీరాములకు నివాళి



దోర్నాల, గిద్దలూరులో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

గిద్దలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టిశ్రీరాములు ప్రాణాలనే పనంగా పెట్టారని, దాని వలనే రాష్ట్రం లభించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నేటితరం రాజకీయ నాయకులు పొట్టిశ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ, వివిధ సంస్థల ప్రతినిధులు దమ్మాల జనార్దన్, పరుచూరి నాగేశ్వరరావు, వితా సుబ్బరత్నం, వాడకట్టు శివప్రసాద్ పాల్గొన్నారు. బీజేపీ నాయకులు సైతం పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎర్రగొండపాలెం : ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంగళరెడ్డి తదితరులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తోట మహేష్, కొత్తమాసు సుబ్రమణ్యం, సుబ్బారావు, సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, పట్టణ అధ్యక్షులు పి మల్లికార్జునరావు, మస్తాన్ వలి, ఆర్యవైశ్యనాయకులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెచ్చా హరగోపాల్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావిక్రింది నరసింహారావు, సుబ్బారావు పాల్గొన్నారు.



రాచర్లలో నివాళి అర్పిస్తున్న శ్రీకాంత్

రాచర్ల : రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని చిన్ని ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మాగులూరు శ్రీకాంత్ అన్నారు. జడ్పీ హైస్కూల్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీఎల్ రామానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న అఖండ కోటి దీపోత్సవం

గిద్దలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుపులవీడు గ్రామంలోని శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5 బుధవారం అఖండ కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా బుధవారం సాయంత్రం అఖండ జ్యోతి ప్రజ్వలన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, భక్తులకు అల్పాహార కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైభవంగా రుద్రపూజ

గిద్దలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో సామూహిక రుద్రపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన ఆనంద్, చంద్రశేఖర్ వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా రుద్రపూజ జరుగగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యోగా గురూజీ నారాయణ రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలవారినీ ఆదుకుంటాం

మాజీ ఎమ్మెల్యేతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని అర్ధవీడు మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కాకర్ల, వెలగలపాయ, పంచాయతీల పరిధిలో దెబ్బతిన్న ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయించి గ్రామాల మధ్య రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి కలెక్టర్ రాజాబాబును కోరారు. శనివారం కలెక్టర్ కంభం చెరువు అలుగును చూసేందుకు వస్తున్నారని తెలుసుకున్న నాగార్జున రెడ్డి తన అనుచరులతో అలుగు వద్దకు వచ్చారు. నాగార్జునకు ఎదురు వచ్చిన కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అశోక్‌రెడ్డి కలుగజేసుకొని నాగార్జునరెడ్డిని కలెక్టర్‌కు పరిచయం చేశారు. అర్ధవీడు మండలంలో తుఫాన్ కారణంగా 11 గ్రామాలకు బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయని నారాయణరెడ్డి కలెక్టర్‌కు చెప్పగా, తాను రెండ్రోజుల కిందటే పర్యటించానని అన్ని ప్రాంతాల్లో తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి బదులిచ్చారు.

దీక్షధారులకు అన్నదానం

రాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప దీక్షధారులకు అయ్యప్ప స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ పేర్ల పరమేశ్వరరెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప ఆలయంలో శనివారం అన్నదానం ఏర్పాటు ఏశారు.

పొగాకు రైతులు లబోదిబో



సీతానాగులవరంలో దెబ్బతిన్న పొగాకు

తర్లుపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో పొగాకు తోటలు రెండు రోజుల నుంచి ఎండకాయడంతో మొక్కలు వేలబడుతున్నాయి. దీంతో పొగాకు రైతులు లబోదిబోమంటున్నారు. సీతానాగులవరంలో ఎక్కువగా ఉన్న తోటలు దెబ్బతిన్నాయి. ఇప్పటి వరకు సుమారు బర్లీ, బ్యార్నీ పొగాకు 800 ఎకరాల్లో సాగు చేశారు. ఈ వర్షాలతో పొగ తోటలన్నీ పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మరలా ప్రస్తుతం వేసిన పొగాకు తోటలన్నీ దున్ని మరలా నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఖర్చు అధికమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు నారు, నాటు రూ.20వేల వరకు ఖర్చు అయింది. ప్రస్తుతం మార్కెట్లో పొగాకు మాడును కూడా కొనేవారు లేక పోవడంతో గతేడాది సాగు చేసిన రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఆరంభంలోనే పొగాకుకు నష్టం జరగడంతో రైతులకు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.



సీఐ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ కిశోర్‌బాబు

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

పామూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు సీఐ మాకినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి ఆయన పామూరు సీఐగా బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల డీసీఆర్బీ నుంచి సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ నియమితులయ్యారు. ఇప్పటివరకు పనిచేసిన భీమానాయక్ గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి లాంటి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను అందరూ పాటించాలన్నారు. ఈసందర్భంగా ఎస్‌ఐ టికిశోర్‌బాబు సీఐకి పుష్పగుచ్ఛం అందజేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ముండ్లమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన వీరమరెడ్డి చెంచు లక్ష్మమ్మ అనే మహిళ తన ఇంటి ఆవరణలో శుక్రవారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారపు గొలుసు లాక్కొని వెళ్లాడు. దీంతో బాధితురాలు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ పీవీ హనుమంతరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ నిర్మాణానికి విరాళం

ముండ్లమూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన ఉల్లగల్లులో ఎన్‌టీఆర్ విగ్రహం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు కోసం రూ.50వేలు నగదును శనివారం రాష్ట్ర అగ్రికల్చర్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తన ప్రతినిధి చింతపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో రమణాల ఏడుకొండలు, నిడిగంటి నారాయణ, చొప్పరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివాలయం ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శనివారం శివాలయం ప్రతిష్ఠ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

దోర్నపు వాగులోపడి రెండు గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

తాళ్లూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దోర్నపువాగులో సుడిగుండంలో పడి రెండు గేదెలు మృతిచెందాయి. కొర్రపాటి వారిపాలెంకు చెందిన గోనుగుంట బాబూరావు తన ఆరుగేదెలను మేతకోసం రజానగరం వెళ్లే మార్గంలోని పొలాలకు తోలుకువెళ్లాడు. ఈక్రమంలో గేదెలు నీరు తాగేందుకు సమీపానగల దోర్నపువాగు వద్దకు వెళ్లాయి. మూడు రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దోర్నపువాగు ఉధృతంగా ప్రవహించి పెద్ద గుంతలు ఏర్పడి సుడిగుండాలుగా మారాయి. రెండు గేదెలు ఆగుంతల్లో పడి మునిగిపోయాయి. గేదెలు బయటకు రాకపోవటంతో యజమాని బాబూరావు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాయి. మృతి చెందిన గేదెల విలువ దాదాపు రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు.

పంచారామ క్షేత్రదర్శినికి ప్రత్యేక బస్సులు

పామూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో కనిగిరి డిపో నుంచి పంచారామ క్షేత్రదర్శిని కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ సిబ్బంది మహేష్, జె.మాల్యాద్రి తెలిపారు. ఈమేరకు కరపత్రాలను స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈవో నరసింహబాబు ఆవిష్కరించారు. పంచారామలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్న ట్లు వారు తెలిపారు. నవంబరు 1,9,16 తేదీల్లో రాత్రి 8 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఒక టిక్కెట్ ధర రూ.2 వేలు ఉంటుందన్నారు. ఈఅవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి, యో గేశ్వరరెడ్డి, గోపిరెడ్డి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ట్రిపుల్‌ఐటీ వద్ద దేవాలయాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. విద్యతో పాటు ఆధ్యాత్మిక భావనలోనూ కనిగిరి రూపొందాలన్నదే తన సంకల్పమన్నారు. మండలంలోని బల్లిపల్లి గ్రామం వద్ద ట్రిపుల్‌ఐటీ కళాశాలకు కేటాయించిన భూములను శనివారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్‌లో మంచి గుర్తింపు సాధించేందుకు ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు ఎంతో ఉపయోగ కరమన్నారు. ఈప్రదేశంలో ఏదైనా గుర్తింపు పొందే కార్యక్రమానికి శ్రీకారం చుడితే బావుంటుందనిపించిదన్నారు. ఈకళాశాల భూముల సమీపంలోఉన్న కొండపై శివలింగ ప్రతిష్ఠ చేసి శివలయాన్ని నిర్మిస్తే భావితరాలకు ఆధ్యాత్మికతకు బాటలు వేసినట్లు ఉంటుందన్నారు. ప్రత్యేక గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసేందుకు కసరత్తు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే పనులు ప్రారంభించగా, ప్రత్యేకంగా ఈప్రాంతానికి వేదపండితులు, రుత్వికులు, సిద్ధాంతులను పిలిపించనున్నట్లు చెప్పారు. భగవంతుడి సంకల్పంతో వచ్చే ఏడాది శివరాత్రి నాటికి పనులు దిగ్విజయంగా చేస్తామన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, ఎస్‌ఐ శ్రీరాం, నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, కొండా కృష్ణారెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, ఫిరోజ్, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పింఛన్ ఓ భరోసా

ఎన్టీఆర్ పింఛన్ లబ్ధిదారులకు ఓ భరోసా అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. శనివారం మండలంలోని నందనమారెళ్ల గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను పెంచి వృద్ధులు, దివ్యాంగులు, ఆసరా లేని మహిళలకు సీఎం చంద్రబాబు ఆరాధ్యుడు అయ్యారన్నారు. పింఛన్ పంపిణీలో నాయకులు ప్రతినెలా పాల్గొని పంపిణీ చేయటం ప్రజల పట్ల ఉన్న సేవాభావాన్ని తెలియ జేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ఏడాదిన్నరలో నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుదే రమణయ్య, పచ్చవ వెంకటేశ్వర్లు, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, కొండా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



పడమరవీరాయపాలెం వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి

కురిచేడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం ఆమె మండలంలో పర్యటించారు. ముందుగా పడమరవీరాయపాలెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వెంటనే అంచనాలు తయారుచేసి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కురిచేడు వస్తుండగా వెంగాయపాలెం బీసీ కాలనీకి చెందిన మహిళలు తమ గృహాలలోకి వచ్చిన నీటిని చూపారు. వర్షపు నీటిని వెంటనే తొలగించాలని ఎంపీడీవోకు సూచించారు. దేనకొండ గ్రామం వద్ద దెబ్బతిన్న పత్తి, పొగాకు తోటలను పరిశీలించి వ్యవసాయాధికారులతో మాట్లాడారు. రైతులకు న్యాయం చేయాలని సూచించారు. సామాజిక పింఛన్లనూ పంపిణీ చేశారు.

ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపు వల్లనే మొంథా తుఫాన్‌తో ప్రాణనష్టం జరగలేదన్నారు. వృద్ధులు, వితంతువులకు పింఛన్లు అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పాత పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు కడియాల లలిత్‌సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, నాయకులు కాట్రాజు నాగరాజు, బొల్లేపల్లి ఆదినారాయణ, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, కిలారి కొండయ్య, కాళ్ల వెంకటేశ్వర్లు, బెల్లం సత్యనారాయణ, బాలయ్య, డిష్ వెంకటేశ్వర్లు, నరసింహారావు, మక్కెన లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది!



దర్శి: అమరజీవి విగ్రహానికి పూలమాలలువేసిన నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు

దర్శి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ వైమహేశ్వరరావు, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ముండ్లమూరులోని గ్రంథాలయంలో శనివారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంథపాలకురాలు విజయకుమారి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలు మరువ లేనివన్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి 128వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. కార్యక్రమంలో బీడీ సీఎల్ నిర్వాహకులు ఆర్.సుధాకర్, టి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగిందని టీడీపీ సీనియర్ నాయకుడు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి) అన్నారు. శనివారం స్థానిక అమరావతి ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, ఐవీ నారాయణ, జంషీర్ అహ్మద్, బుల్లా బాలబాబు, తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లి: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు, తదితరులు

పామూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా స్థానిక వాసవీమాత దేవస్థానం వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కూటమి శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, యారవ శ్రీను, అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, మన్నం రమణయ్య, కోటా నరసింహారావు, బీజేపీ నాయకుడు కె.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగమే పునాదిగా నిలిచిందని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పడమటిపల్లిలో ఉన్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి శనివారం ఇతర శాఖల అధికారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అమరులయ్యారని గుర్తుచేశారు. ఆయన త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పది మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జేబీ రామారావు, వీవీ రమణారావు, ఇందూరి వెంకటనరిసిరెడ్డి, యెలిసెట్టి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



దర్శిలో పునరావాస బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

దర్శి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకొని గృహాలకు వెళ్తున్న నేపథ్యంలో శనివారం బాధితులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నిత్యావసర సరుకులు అందజేశారు. మండలంలో మొత్తం 57 మంది పునరావాస కేంద్రాల్లో మొంథా తుఫాన్ కారణంగా తలదాచుకోగా వారికి రూ.3వేలు చొప్పున నగదు. 25 కేజీల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, ఉల్లిగడ్డలు, బంగాళదుంపలు, పంచదార పంపిణీ చేశారు. దర్శిలో జరిగిన ఈకార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అనుభవంతో భయంకరమైన తుఫాన్‌లో ఒక్క ప్రాణనష్టం జరగకుండా కాపాడటం జరిగిందన్నారు. వైసీపీ సైకోబ్యాచ్ తుఫాన్ బాధితులకు అండగా నిలవటానికి బదులు తప్పుడు ప్రచారం చేయటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వ రరావు, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మొంథా తుఫాన్ పునరావాస బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుందని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో పునరావాసం కల్పించిన బాధితులకు నిత్యావసర వస్తువులు, నష్టపరిహారం శనివారం అందజేశారు. తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ మండలంలో ఏర్పాటుచేసిన నాలుగు పునరావాస కేంద్రాలందు తలదాల్చుకున్న 93 కుటుంబాలలోని 254 మందికి ప్రభుత్వం తుఫాన్ రిలీఫ్ ఫండ్ కింద రూ2లక్షల 13 వేలు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్ రెడ్డి, దర్శి మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ ఖాశింసైదా, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రంలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నగదు, నిత్యావసర సరుకులను తహసీల్దార్ బి.రమాదేవి శనివారం పంపిణీ చేశారు. భారీ వర్షాలకు దొనకొండలో లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్న ఐదు పేద కుటుంబాలను అధికారులు గుర్తించి ముందస్తు చర్యగా పునరావాస కేంద్రానికి తరలించి భోజన ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య తదితరులు

పెద్ద కొడుకులా ఆదుకుంటున్న చంద్రబాబు

» మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

» పలుచోట్ల పింఛన్‌లు పంపిణీ

దర్శి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తూ సీఎం చంద్రబాబు ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నా ప్రజాప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లు ఎప్పుడు అందుతాయో, ఉద్యోగులకు జీతాలు ఎప్పుడిస్తారో అని ఎదురు చూసే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో ప్రతినెలా పెంచిన పింఛన్లు అందుతుండటంతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు తన విజనరీ ద్వారా మొంథా తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

తాళ్లూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం బెల్లంకొండవారిపాలెంలో గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్‌లు పంపిణీ చేశారు. మండలంలో 6176 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, మొదటి రోజు 5626 మందికి 91శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పి.అజిత తెలిపారు.

ముండ్లమూరు: మండలంలోని పూరిమెట్లలో శనివారం దర్శి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కోడిగ మస్తాన్‌రావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని శంకరాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి పింఛన్‌లను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోనూ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

పామూరు: ఎన్టీఆర్ భరోసా కింద అందజేస్తున్న పింఛన్లతో కుటుంబాలకు ఆర్థిక భరోసా చేకూరుతుందని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని బొట్లగూడూరు, గోపాలపురం, ఎర్రచేలు, తదితర చోట్ల టీడీపీ నాయకులు బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, ఉమ్మడి శ్రీను, జనసేన నాయకులు వై.రహీముల్లా, దరిశి ఏడుకొండలు తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు. సీఎస్‌పురం మండలంలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, ఎస్‌సీ మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలో శనివారం లబ్ధిదారులకు పింఛన్‌లను సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఎంపీడీవో జీవీ కృష్ణారావు పెదఅలవలపాడు, కమ్మవారిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.

చెరువులకు జలకళ

దొనకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మండలంలో 32 పంచాయతీ, 11 ఇరిగేషన్‌తో మొత్తం 43 చెరువులు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా నీళ్లకు నోచుకోని చెరువులు ప్రస్తుతం కురిసిన వర్షాలకు రెండు మూడు చెరువులకు నూరు శాతం నీరు చేరింది. మిగిలిన చెరువుల్లో దాదాపు 60శాతంమేర నీరు చేరినట్టు అధికారులు అంచనాలు వేస్తున్నారు. గత వైసీపీ పాలనలోని ఐదేళ్లల్లో చెరువులకు కనీస మరమ్మతులు చేయలేదు. దీంతో చెరువుల గట్లు ప్రమాదకరంగా ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని వద్దిపాడు చెరువుకు పూర్తిగా నీరు చేరటంతో తూము వద్ద కట్టకు గండి పడింది. దీంతో చెరువులోని నీరు చాలావరకు వృథాగా పోయింది. ఇరిగేషన్ అధికారులు హుటాహుటీన మరమ్మతులు చేపట్టారు. చెరువులకు గండ్లు పడకుండా కట్టల పటిష్టతకు సరిపడా మట్టిని ఏర్పాటుచేస్తూ, చిల్లచెట్లు తొలిగించేలా ఇరిగేషన్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కెల్లంపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రమేష్

ముండ్లమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి మండలంలోని పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి వాలిపోవటంతో మొక్కలు మొలకెత్తవచ్చని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జి.రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నేలవాలిన వరి మొక్కలను నిలబెట్టుకొని లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు నీటి ద్రావణాన్ని కలిపి పిచికారి చేయటం వల్ల విత్తనాలు మొలకెత్తకుండా నివారించవచ్చునని చెప్పారు. మొక్కజొన్న పడిపోయినట్లయితే పొలంలో నీరు లేకుండా చూసుకొని మొక్కలు నిలబెట్టి మొదళ్లల్లోని మట్టిని తొక్కాలని తెలిపారు. 60 రోజుల పంట అయినట్లయితే మొక్కలను నిలబె ట్టుకొని 20 కేజీల యూరియా, పది కేజీల పొటాష్‌ను ఒక ఎకరానికి వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో తిరుమలరావు, వీఏఏ విజయనిర్మల పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాముల జీవితం అందరికీ ఆదర్శమని హెచ్‌ఎం షేక్ షరీఫ్ అన్నారు. శనివారం సీఎస్‌పురం మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలు గురించి వివరించిన 6వ తరగతి విద్యార్థిని మౌనికకు తెలుగు ఉపాధ్యాయురాలు శిరీష ప్రత్యేక బహుమతి అందజేశారు, చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో గెలుపొందిన సిద్దిక్, సంతోష్, గిరీష్‌లకు హెచ్‌ఎం షరీఫ్ బహుమతులు అందజేశారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం 14న నిరాహారదీక్ష

ఒంగోలు విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని 136 ఎయిడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14న నిరాహారదీక్ష చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.





మోదేపల్లి వద్ద రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణ ప్రసాద్

ప్రతీ ఎకరాకు పరిహారం అందిస్తాం

అవకతవకలకు ఆస్కారం లేకుండా అంచనాలు • అద్దంకి పర్యటనలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి: కుంకుపాడు వద్ద మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్

అద్దంకి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన ప్రతీ ఎకరాకు పరిహారం అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని కొటికలపూడి, కుంకుపాడుల్లో శనివారం మొక్కజొన్న, పొగాకు పంటలను ఎంపీ కృష్ణ ప్రసాద్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. పంట నష్టం నమోదు విషయమై కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు క్షుణ్ణంగా పంటలను పరిశీలించి అవకతవకలకు ఆస్కారం లేకుండా నష్టం అంచనాలను నమోదు చేయాలన్నారు. వ్యవసాయాధికారులకు అందుబాటులో ఉండి, వారిని తీసుకువెళ్లి పంట నష్టం నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

మరమ్మతులు చేపట్టాలి..

చిలకలేరు ఉధృతికి తిమ్మాయపాలెం- ఇల పావులూరు మార్గంలో మోదేపల్లి వద్ద కోసుకు పోయిన రోడ్డును, పేరాయపాలెం వద్ద దోర్నపు వాగుపై కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జిని మంత్రి పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మ తులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలన్నారు. బ్రిడ్జి, రోడ్డు పునర్నిర్మాణ వ్యయంపై అంచనాలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండానే పనులకు ఒత్తిడి తెస్తున్నారని పలువురు రైతులు మంత్రికి తెలిపారు. వెంటనే పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవో చంద్రశేఖరనాయుడుకు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఏడీఏ ఏప్రాయం, ఏవో వెంకటకృష్ణ, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈ దామోదరం, ఏఈ శివప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు మానం మురళీమోహన్‌దాస్, నేతలు నాగినేని రామకృష్ణ, కరిప రమేష్, గాలం శ్రీనివాస రావు, పూనాటి విక్రమ్, నర్రా వీరయ్య, శ్రీనివాసరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి..రూ.కోటి నష్టం

• తుఫాన్‌తో కోల్పోయిన ఆదాయం
• డిపోలకే మూడు రోజులు బస్సులు పరిమితం

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఆర్టీసీకి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. తుఫాన్ ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో చార్జీల రూపంలో వచ్చే ఆదాయాన్ని ఆర్టీసీ కోల్పోవాల్సి వచ్చింది. మరో వైపు తుఫాన్‌తో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. దీంతో గత నెల 27 నుంచి 29 వరకు చార్జీల రూపంలో వచ్చే ఆదాయానికి గండిపడింది.



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్

ఇక అరకొరగా బస్సులు తిరిగినా చాలా తక్కువగా ప్రయాణికులు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు చెప్పారు. గతంలో నిత్యం గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి చార్జీల రూపంలో రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఆదాయం వచ్చేది. తుఫాన్‌తో గుంటూరు జిల్లాలోని అన్ని డిపోల్లోనూ రోజువారీ వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వచ్చిందని జిల్లా ప్రజారవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. ఇక తుఫాన్ తీరం దాటిన తర్వాత 29న దాదాపుగా అత్యధిక శాతం సర్వీసులు డిపోలకే పరిమి తమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని రూట్లలో బస్సులను రద్దు చేశామని డీపీటీవో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ప్రయాణికులు ప్రయాణాలకు దూరమవడంతో బస్టాండ్లలో వ్యాపారాలు లేక వ్యాపారులకూ నష్టాన్ని మిగిల్చింది. ప్రయాణికుల్లేక బస్టాండ్లలో దుకాణ దారులు దుకాణాలను మూడు రోజులు మూసేశారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

• కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనుల సమస్యలు పరిశీలించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున గిరిజన స్వా



గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్, తదితరులు

తంత్ర్య సమరయోధులను స్మరించుకునేందుకు ప్రభుత్వం జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ప్రచార మాధ్యమాలు లేని రోజుల్లో కొండ ప్రాంతాలకు వెళ్లి గిరిజనులను చైతన్యం చేసిన పలువురు నాయకులు బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీపీవో ప్రభాకర్, డీఈవో పురుషోత్తం, జిల్లా గిరిజన, సాంఘిక సంక్షేమశాఖాధికారులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు కారణంగా నీరు నిల్వ ఉండి క్రిములు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జాగ్రత్తలు పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల భారీ నుంచి రక్షించుకోవచ్చని చెప్పారు. ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పురాలకు పన్ను నొప్పి

• ఆస్తి పన్ను వసూలులో అలసత్వం
• బకాయిలు రూ.76.51 కోట్లు
• పట్టణాల్లో కుంటుపడుతున్న ప్రగతి

మునిసి పాలిటీలకు ఏళ్ల తరబడి 'పన్ను' నొప్పి పట్టి పీడిస్తోంది. పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వసూలులో అలసత్వం తాండవిస్తోంది. సాధారణ నిధుల లేమితో పట్టణాల్లో ప్రగతి కుంటు పడుతోంది. వడ్డీ రాయితీ ఇస్తున్నా.. బకాయిలను సిబ్బంది వసూలు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అంతంతమాత్రమే. కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు చెల్లింపు, ప్రజలకు మౌలి క వసతులు కల్పనకు పన్ను ఆదాయంపైనే మునిసిపాలిటీలు ఆధార పడుతున్నాయి. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకటనల పన్ను పెద్దఎత్తున ఎగవేస్తున్నా చోద్యం చూస్తూ.. అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పురపాలక సంఘాలకు రూ.76.51 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాల్సి ఉన్నట్లు మునిసిపల్ పరిపాలన విభాగం లెక్కలు చెబుతున్నాయి. పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా వ్యాపార, వాణిజ్య, రాజకీయ పార్టీల ప్రచార బోర్డు లు ఉంటున్నాయి. వీటి ద్వారా వచ్చే ప్రకటన పన్ను పక్క దారి పడుతోంది. నిబంధనల ప్రకారం ఈ పన్ను విధిం చడంలో.. పట్టీపట్టనట్లు పురపాలకులు వ్యవహరిస్తున్నారు. ప్రకటనలు, వీటి ద్వారా వచ్చే ఆదాయానికి పొంతన ఉండటం లేదు. ఏటా ఒక్కొక్క మునిసిపాలిటీ రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతుంది. ప్రకటనల ఆదాయం పెంచుకునే ప్రయత్నాలు లేవనే చెప్పాలి. కొందరు యాడ్స్ ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై మునిసిపాల్టీలకు రావాల్సిన ఆదాయాన్ని వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా రాజకీయ, ప్రైవేట్ వ్యక్తుల కార్యక్రమాల సందర్భంగా వేల సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నిటికీ (మిగతా 6వ పేజీలో)



ఆక్రమణలతో బక్కచిక్కిన కుందేరు

ఆక్రమణలతో ఆటంకాలు

• తొలగని వరదతో చెరువుల్లా రోడ్లు

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తు ఒకటి రెండు రోజులకు పరిమితం కాగా మానవ తప్పిదం ప్రజలను రోజుల తరబడి ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇందుకు ఉదాహరణగా మొంథా తుఫాన్ నిలుస్తోంది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు నిలిచి నాలుగు రోజులు అవుతున్నా ఆ విపత్కర పరిస్థితులు ఇంకా ప్రజలను వెంటాడుతున్నాయి. ఎక్కడికక్కడ ఆక్రమణలతో వర్షపు నీరు పోయే మార్గాలు మూసుకుపోయాయి. దీంతో అనేక కాలనీలతో పాటు, రోడ్లు, పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీటిని తొలగించేందుకు అధికారులకు తలకుమించిన భారంగా మారుతోంది. ముంపునకు ఆక్రమణలే కారణమని తెలిసినా ప్రస్తుతం ఏమీ చేయలేని పరిస్థితి. వాడరేవు - చిలకలూరిపేట పాత 167ఏ జాతీయ రహదారిలో హాయ్ రెస్టారెంట్ నుంచి వాడరేవు వరకు డ్రెయిన్లతో సంబంధం లేకుండా ఆక్రమణలతో నిండిపోయింది. దీంతో సమీప ప్రాంతాల ప్రజలు రోజుల తరబడి వాన నీటిలో ఉండాల్సి వచ్చింది. అలాగే పట్టణంలో డ్రెయిన్ల ఆక్రమణలతో నీటి పారుదల వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. దీంతో ప్రస్తుతం వార్డుల్లో వర్షపు నీటిని తొలగించేందుకు అధికారులు ఆసనాలు వేయాల్సి వస్తుంది.

కుందేరు వినియోగం లేక అవస్థలు



పాత 167 ఏ జాతీయ రహదారి ఇలా..

బ్రిటీషు హయాంలో తుఫాన్ల సమయంలో ముప్పు లేకుండా ఉండేందుకు కుందేరును వినియోగంలోకి తెచ్చారు. పేరలి నుంచి బాపట్ల, వెదుళ్లపల్లి, ఈపూరుపాలెం, చీరాల, వేటపాలెం, చినగంజాం, వరకు ప్రవహిస్తోంది. గతంలో వరద, తుఫాన్ నీటిని తొలగించేందుకు పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అది ఆక్రమణలతో బక్కచిక్కింది. ఇబ్బడి ముబ్బడిగా నివాసాలు, వ్యాపార సముదాయాల తో చాలావరకు అంతరించింది. గతంలో దీని ప్రక్షాళనకు అధికారులు ప్రయత్నించినా పలు కారణాలతో మరుగున పడింది. అలాగే పర్చూ రు, కారంచేడు వంటి ప్రాంతాలకు ముంపు లేకుండా ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ అందుబాటులో ఉన్నా ఆక్రమణలు ఆటంకంగా మారాయి.

ఉరకెత్తుతున్న పైర్లు

• ఆందోళనలో అన్నదాతలు
• ఇంకా వర్షపు నీటిలోనే పొలాలు

పర్చూరు నీట మునిగి ఉరకెత్తుతున్న పత్తి పైరు



పర్చూరు/కారంచేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో పైర్లు నీటి పాలయ్యాయి. వేల ఎకరాల్లో పొలాలు ముంపుబారిన పడ్డాయి. వర్షం తగ్గి మూడు రోజులు గడుస్తున్నా పొలాలను ముంచెత్తిన నీరు బయటకు పోకపోవడంతో పైర్లు ఉరకెత్తి ఎండు ముఖం పడుతున్నాయి. పైర్లను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. పొలాల్లో నీరు తగ్గకపోవడంతో ఏమిచేయాలో పాలుపోనిస్థితిలో రైతులు ఉన్నారు. వేలకువేలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలు చేతికందకుండా పోతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో వేల ఎకరాల్లోని వరి, మిర్చి, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, రమణాయపాలెం, చెరుకూరు తదితర ప్రాంతాల్లోని చేలు చెరువుల్లా మారాయి.

పైర్లను పరిశీలించిన వ్యవసాయాధికారులు

కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో నీటమునిగిన పైర్లను ఏడీఏ ప్రవీణ, ఏవో భాస్కర్‌రావు శనివారం రైతులు, స్థానిక నేతలతో కలసి పరిశీలించారు. కారంచేడు మండలం స్వర్ణ ప్రాంతంలో నీట మునిగిన పంటలను ఏపీ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ తిరుమలశెట్టి శ్రీహరి నేతృత్వంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంట నీట మునిగి నష్టపోయిన ప్రతి రైతులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు.



నీట మునిగిన వరి పైర్లను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రవీణ

ఉత్సవాలపై ఆరా



అమరావతి : క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు (పాత చిత్రం)

• ప్రార్థనలు, వేడుకలపై ప్రభుత్వం దృష్టి
• నివేదిక పంపాలని అధికారులకు ఆదేశాలు
• కాశీబుగ్గ దుర్ఘటనతో ముందస్తు భద్రతకు ఏర్పాట్లు

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ దుర్ఘటన నేపథ్యంలో ఆలయాల వద్ద తొక్కిసలాట జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోతుండటంతో భద్రత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఇక నుంచి జరగబోయే ఉత్సవాలను ఒక క్యాలెండర్ రూపంలో తయారు చేసి పంపాలని సూచించింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఏమిటి? వాటిల్లో జరిగే ఉత్సవాల నిర్వహణ, అవి ఏ తేదీల్లో జరుగుతాయి. సగటున ఎంతమంది భక్తులు వస్తారు. అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలే ఏమిటి వంటి వివరాలపై నివేదిక రూపొందించి పంపాలని ప్రభుత్వం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు వాటిని నివేదించేందుకు కలెక్టరేట్ల అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా పరిధిలోని దేవాలయాలు, చర్చిలలో ఏటా పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దర్గాల వద్ద కూడా ఉరుసు ఉత్స వాలు భారీగా జరుగుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ప్రముఖ ఆలయాలు, చర్చిలు, దర్గాల వద్ద ఉత్సవాలు జరిగేటప్పుడు ఆయా నిర్వాహక కమిటీలు ముందుగానే పోలీసులకు తెలియజేస్తాయి. దాంతో వాటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి తొక్కిసలాట జరగకుండా క్రమబద్ధీకరిస్తుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమరావతి, మంగళగిరిలో రథోత్సవం భారీగా జరుగుతోంది. అలాగే పొన్నూరు, చేబ్రోలు, బాపట్ల, తెనాలిలోనూ వివిధ పండుగల సమయాల్లో ఉత్సవాలు జరుగుతుంటాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ మహాసభలు, గోరంట్లలో హోసన్నా మందిరం ఉత్సవాలు జరుగుతుంటాయి. వీటికి ఏటా వేలల్లో భక్తులు తరలి వస్తుంటారు. మస్తాన్‌దర్గా, పెదకాకాని బాజీబాబా ఉరుసు మహోత్సవాలు, ఫిరంగిపురంలో చర్చి ఉత్సవాలకు కూడా జనాలు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇవికాక కంఠమరాజు కొండూరు, కొండపాటూరు తిరునాళ్ల, గోవాడలోని ఆలయాల వార్షికోత్సవాలు కూడా భారీగా నిర్వహిస్తారు. పల్నాడు జిల్లాలోని కారంపూడిలో వీరారాధన ఉత్సవాలకు కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. శివరాత్రి సమయంలో కోటప్పకొండ తిరునాళ్ల, అమరావతిలో రథోత్సవం, బొప్పూడి ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవాలు జరుగుతాయి.

బాపట్ల జిల్లాలోనూ భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ప్రార్థనాలయాలు ఉన్నాయి. కొన్ని దేవాలయాలు దేవదాయశాఖ ఆధీనంలో లేకపోవడంతో అవి ప్రైవేటు కమిటీల పర్యవేక్షణలో కొనసాగు తున్నాయి. దీని వలన వాటిల్లో జరిగే ఉత్సవాల గురించి పోలీసుశాఖకు తగిన సమాచారం ఉండటం లేదు. దీని వల్ల అనూహ్యంగా భక్తులు వస్తే తొక్కిసలాట జరుగుతున్నది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలే జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా ప్రభుత్వం అన్ని దేవాలయాలకు సంబంధించిన ఉత్సవాలతో ఒక క్యాలెండర్‌ని రూపొందించాలని నిర్ణయించింది. ఆ మేరకు తగిన భద్రత చర్యలు చేపట్టడం ద్వారా ఇకపై తొక్కిసలాట సంఘటనలకు ఆస్కారం లేకుండా చూసేందుకు నివేదికలను పంపాలని ఆదేశించింది.

'డాక్టర్ రెడ్డీస్'లో ఉద్యోగాలకు వర్సిటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బోటనీ, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ విద్యార్థులు హైదరా బాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఇంటర్న్‌షిప్‌తో పాటు శాశ్వత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఈ నెల 3 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రతి విద్యార్థికి నెలకు రూ.25 వేలు పారితోషకం లభిం చనుంది. విజయవంతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు రూ.5 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరనున్న ట్లు తెలిపారు. విద్యార్థులు అరిస లక్ష్మీ అనూష, జి.సత్తిబాబు, భావనా, వేమూరి శైలజ, రోహిణి లింగుడు, సొంగా అజయ్ సుజిత్ ఈ అవకాశాన్ని దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉప కుల పతి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య వీరయ్య విద్యార్థులను అభినందించారు. ప్రాంగణ నియా మకాల అధికారులు డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, డాక్టర్ తౌసీఫ్ పాల్గొన్నారు.

పీజీ, యూజీ పరీక్షల ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బీటెక్, బీఈడీ, ఎంఎస్సీ నానో టెక్నాలజీ, ఎంటెక్ పరీక్షల ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి ఆలపాటి శివప్రసాద్‌రావు శనివారం విడుదల చేశారు. రీవాల్యూయేషన్ దరఖాస్తులు ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలని సూచించారు. పేప ర్‌కు రూ.1,860, జవాబు పత్రాల పరిశీలనకు రూ.2,190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం

● వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

● కలెక్టర్ రాజాబాబు

మార్కాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ రాజాబాబు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా తుఫాన్ నేపథ్యంలో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి మార్కాపురం, వేములకోట చెరువులను డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో దెబ్బతిన్న పత్తిని వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా రికార్డుస్థాయిలో ఒక్కసారిగా తుఫాన్ ప్రభావంతో 20 సెంటీ మీటర్ల వర్షం కురిసిందన్నారు. తద్వారా వాగులు, వంకల్లో ప్రవాహం పెరిగి పంట పొలాలు, కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు చేరాయన్నారు. కొన్నిచోట్ల రోడ్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా నష్టాలను నమోదు చేస్తున్నామన్నారు. పూర్తి సమాచారం రాగానే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. తుఫాన్ సమయంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాగంతో కలిసి సమన్వయం చేసుకుని పనిచేయడంతో ప్రాణనష్టాన్ని నివారించగలిగామన్నారు. అధిక వర్షంతో చెరువులకు గండ్లు పడ్డాయన్నారు. మార్కాపురం చెరువుకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. చెరువు నీటిని సమర్థంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తే ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చన్నారు. మొంథా తుఫాన్ సమయంలో ముఖ్యమంత్రి అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు పార్టీ కేడర్‌ను సమన్వయంతో దిశానిర్దేశం చేసి తీవ్రత తగ్గేలా పని చేయించారన్నారు. నష్టపోయిన రైతులను కూడా తప్పకుండా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎస్ఈలు వరలక్ష్మి, అబూతలీమ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఎస్ఈలు బాలశంకర్‌రావు, రవినాయక్, అశోక్‌కుమార్, డీపీవో వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



టంగుటూరు వద్ద రేషన్ ట్రాక్కును పట్టుకుంటున్న ఎస్సై, పోలీసులు

రేషన్‌బియ్యం తరలిస్తున్న వాహనాల పట్టివేత

నాగులుప్పలపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న నాలుగు వాహనాలను ఎస్ఐ రజియాసుల్తానా పట్టుకున్నారు. చీరాల ప్రాంతం నుంచి కావలికి నాలుగు వాహనాలలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు చదలవాడ సమీపంలోని పశుక్షేత్రం వద్ద గల జాతీయ రహదారిపై ఎస్ఐ రజియాసుల్తానా తన సిబ్బందితో శనివారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయా వాహనాల్లో 545 రేషన్‌బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

41 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

టంగుటూరు (కొండపి) : కొండపి వైపు నుంచి కావలికి మినీ ట్రక్కులో తరలిస్తున్న 41 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం టంగుటూరులోని ఫ్లై ఓవర్ వద్ద పట్టుకున్నారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న మద్దెల కిషోర్, చేవూరు వినోద్, దాసరి రాంబాబు, నాసిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మినీ ట్రక్కును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండ

● బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ్ చక్రవర్తి



నీటి మునిగిన పంటను పరిశీలిస్తున్న సూర్యకల్యాణ్ చక్రవర్తి, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కృషి చేస్తామని బీజేపీ సెల్స్ రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. శనివారం పొదిలి, కొనకనమిట్ల మండలాల్లోని మునగపాడు, నాగరాజుకుంట గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ, మిర్చి, కంది, మినుము తదితర రకాల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతిరైతుకు ఫసల్‌బీమా, రాష్ట్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ ద్వారా ఆదుకుంటాయన్నారు. అనంతరం ఆ యా గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, మాకినేని అమరసింహం, రాయపాటి అజయ్, బెల్లంకొండ విజయలక్ష్మి, రాజేష్‌వర్మ, మన్నం సురేష్, రమణారెడ్డి, కల్లంసుబ్బారెడ్డి, కిలారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురాలకు పన్ను నొప్పి..

(5వ పేజీ తరువాయి)

ప్రకటన పన్ను వసూలు చేయాలి. కానీ, పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పన్ను వసూలు చేయక పోగా.. వాటిని తొలగించడానికి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తు పరిస్థితి కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నెలకొంది. ప్రకటనల పన్ను ఆదాయం పెంచుకొనే దిశగా పురపాలకుల చర్యలు లేవన్న విమర్శలున్నాయి.

పేరుకుపోతున్న ఆస్తి పన్ను బకాయి

ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారించడం లేదు. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో సహా పన్నుల బకాయిలు భారీగానే ఉన్నాయి. ఈ జిల్లాలో రూ.61.63 కోట్లు పన్ను బకాయిలు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. జీఎంసీలో రూ.53.11 కోట్లు, మంగళగిరి మునిసిపాల్టీలో రూ.4.89కోట్లు బకాయిలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలోని మునిసిపాల్టీలకు సంబంధించి రూ.3.72 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది. చీరాల పురపాలక సంఘంలో రూ.1.92 కోట్లు వసూలు చేయాలి. పల్నాడు జిల్లాలోని మునిసిపాల్టీల్లో రూ.11.16 కోట్లు బకాయి ఉంది. ఒక్క నరసరావుపేట మునిసిపాల్టీలో రూ.3.62 కోట్లు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మునిపాల్టీల్లో రూ.2 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. బకాయి వసూలు చేస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. ఈ దిశగా పురపాలకులు స్పందించాలి.

అర్హులందరికీ పింఛన్లు

● మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ● పాల్గొన్న ప్రజాప్రతినిధులు

అద్దంకి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోయినా, అర్హులందరికీ, 1వ తేదీనే పింఛన్లు అందజేస్తున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చక్రాయపాలెంలో ఎన్‌టీఆర్ పెన్షన్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అర్హులందరికీ, పింఛన్లు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. అనంతరం చక్రాయపాలెం హైస్కూల్‌లో చదువుతున్న 125 మంది విద్యార్థులకు సెడ్‌క్యాప్ సహకారంతో సైకిళ్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రైవేటు ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఏటా డీఎస్సీ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చక్రాయపాలెం హైస్కూల్‌లో ఆర్‌ఓ ప్లాంట్, బోరు ఏర్పాటు చేయడంతో పాటు అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. 10 తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. గుండ్లకమ్మ నదిలో యంత్రాలు వినియోగించకుండా కూలీల ద్వారా ఇసుక లోడింగ్ చేసుకుంటూ ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు, డిప్యూటీ సీఈవో బాలమ్మ, తహసీల్దార్ శ్రీచరణ్, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్,కతారి నాగేశ్వరరావు, రాజశేఖర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

93 శాతం పింఛన్ల పంపిణీ

పంగులూరు : మండలంలో 93శాతం సామాజిక ఫించన్ల పంపిణీ చేసినట్లు మండలంలోని 21 పంచాయితీల పరిధిలో మొత్తం 7,827 సామాజిక ఫించన్లు కాగా శనివారం సాయంత్రానికి 7,400 మందికి ఫించన్లు అందజేశారు. ముప్పవరం, పంగులూరు గ్రామాలలో సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు గరిమిడి జగన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేల్పుల మరియదాను, బాచిన చౌదరిబాబు, పంచాయితీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో శనివారం పింఛన్ల పంపిణీని వేగవంతంగా పూర్తి చేశామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. శనివారం వైదన గ్రామంలో ఎంపీడీవో పింఛన్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతు మెదటి రోజు 93.73 శాతం మందికి పింఛన్లు సచివాలయాల సిబ్బంది అందజేశారన్నారు. మిగిలిన వారికి సోమవారం పింఛన్లు అందజేస్తామ న్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ యువ నాయకులు పోగుల చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

మార్టూరు : వృద్ధులకు ప్రతి నెలా ఒకటవ తేదీన పింఛన్లను అందజేయడం ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోందని, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఆయన మార్టూరు పంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీలో సామాజిక పెన్షన్ల పంపిణీ చేశారు. స్కూల్ లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా ఏర్పాటుచేస్తున్నారా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో ప్రహరిగోడ సమస్య ఉందని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అధికారులతో మాట్లాడారు. అనంతరం కాలనీలోని చర్చి అభివృద్ధికి సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వస్రాం నాయక్, పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు, బండి నాగేశ్వరరావు, తన్నీరు బూదెయ్య, తుమ్మల వెంకట్రావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, షేక్ ఫారూక్, కాకోలు వెంకటేవ్వర్లు, తాటి నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బొల్లాపల్లి గ్రామానికి చెందినమొగిలిచర్ల హర్షవర్ధన్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష విలువైన ఎల్‌వోసీని ఆయనకు అందచేశారు.



చక్రాయపాలెంలో పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి రవికుమార్

సామాజిక పింఛన్లతో నిరుపేదలకు భరోసా

చీరాల : ప్రజాకూటమి ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న సామాజిక పింఛన్లతో చక్కని భరోసా అందుతుందని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని 19వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సామాజిక పించన్‌లను చైర్మన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల ఎటువంటి విపత్కర సమయాల్లో కూడా పించన్ల సమస్యలు లేకుండా పంపిణీ జరుగుతున్నట్లు వివరించారు. చైర్మన్ వెంట కూటమి నాయకులు పాకల సత్యనారాయణ, ఇస్మాయేల్, సుబ్బారావు, సచివాలయ సిబ్బంది అన్నారు.







వైదనలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో , విజయనగర్ కాలనీలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, చీరాలలో పాల్గొన్న చైర్మన్ సాంబశివరావు

భక్తిశ్రద్ధలతో ఉత్థాన ఏకాదశి పూజలు



సంతపేట బాబా ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు



చెన్నకేశవ ఆలయంలో ఏకాదశి విశిష్టితను వివరిస్తున్న అర్చకుడు

● ఆలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉత్థాన ఏకాదశి పండుగను ప్రజలు శనివారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు వైష్ణవాలయాలలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇక ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, కలశారాధన, రమా సహిత సత్యనారాయణ స్వామి వారికి అభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, వ్రత కథా శ్రవణం మొదలైన కార్యక్రమాలు జరిగా యి. దేవస్థాన ఈవో ఆర్.శివశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అటు స్థానిక సంతపేట సాయి బాబా మందిరంలో సైతం ఏకాదశి వ్రతాలను ఘనంగా నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం, శ్రీసీతా రామ చంద్రస్వామి దేవస్థానం, కొత్తపట్నం రోడ్డులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థా నం మొదలైన పలు వైష్ణవాలలో ప్రత్యేక పూజలు జరిగాయి.

మల్లవరంలో గిరి ప్రదక్షిణ

మద్దిపాడు: ఉత్థాన ఏకాదశి సందర్భంగా శ్రీవారి వనం కమిటీ ఆధ్వర్యంలో మల్లవర గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి నెలా శుక్ల పక్ష ఏకాదశి రోజున గిరి ప్రదక్షిణ నిర్వహించాలని నిర్ణయించారు. గోవింద నామ బృందం సభ్యులు బోయపాటి సుబ్బారావు, కనపర్తి శారద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణ చేశారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. శ్రీవారివనం కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, ప్రధానకార్యదర్శి బోయపాటి రవి, కోశాధికారి మన్నం శ్రీనివాస్, సభ్యులు మార్నేని సుబ్బారావు, కారుమూడి చిన్నవెంకటేశ్వర్లు, నన్నపనేని కోటయ్యలు పాల్గొన్నారు.



ఆవుతో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం అందజేత



చదలవాడలో సాయం అందజేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



పీర్లమాన్యంలో నగదును అందిస్తున్న అధికారులు, నాయకులు

నాగులుప్పలపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యో తి): మొంథా తుఫాన్ ప్రభావంతో వరద ముం పునకు గురైన పలు గ్రామాల బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం అందజేశారు. చదలవాడ, రాపర్ల, నాగులుప్పలపాడు గ్రామాల్లోని వరద బాధితులకు నగదుతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండల పరిధిలో 320 కుటుంబాలు వరద ముంపునకు గురైనట్లు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు అందుకు గానూ బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు రూ.6,60,000 విడుదల చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

పీర్లమాన్యం పరిధిలో

సంతనూతలపాడు: పేర్నమిట్టలోని పీర్లమా న్యం పరిధిలో గల క్విస్ హైస్కూల్లోని 109 మంది నిర్వాసితులకు శనివారం రూ.2.87లక్షలు పరిహారం, నిత్యావసర వస్తువులు, కూరగాయలను టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు ఆరికట్ల సుమతి, జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు, మండలస్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి, తహసీల్దార్ నారాయణరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఆర్ఐ రామ్‌తేజ పాల్గొన్నారు.

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

చీమకుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనంనేనివారిపాలెం నుంచి చీమకుర్తికి వచ్చే ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. తీగలతో ఉన్న కరెంట్ స్తంభం రోడ్డు పైకి వంగిపోయి ఏ నిమిషాన్నైనా కింద పడే స్థితిలో ఉంది. ఈ రహదారిపై నిత్యం వాహనదారులు రాకపో కలు సాగిస్తుంటారు. అయితే ఈ కరెంట్ స్తంభం స్థితి చూసిన ప్రజలు భయభయంగా ప్రయాణం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే స్తంభాన్ని సరిచేయాల్సింది గా వాహనదారులు కోరుతున్నారు కాగా ఈ విషయమై కేవీ పాలెం నాయకులు విన్నవించుకుంటున్నా విద్యుత్ సిబ్బంది లో చలనం లేకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో నెల్లూరు నగరంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలానికి చెందిన లావణ్య(21)కు నెల్లూరు 4వ మైలు ప్రాంతానికి చెందిన వినోద్‌తో 2023 మేలో వివాహం జరిగింది. వారికి 5 నెలల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం వారు నగరంలోని మల్లెతోటలో నివాసం ఉంటున్నారు. ఇటీవల దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని ఆమె తన కుటుంబసభ్యులకు చెప్పగా వారు పలు మార్లు దంపతులకు నచ్చజెప్పి సంతోషంగా కాపురం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి వినోద్ పని నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. శనివారం లావణ్య తన అక్క కీర్తికి, భర్తకు నేను చనిపోతున్నానని మెసేజ్ చేసింది. దీంతో కీర్తి విషయాన్ని తన తండ్రి కోటేశ్వరరావుకు తెలియజేయగా ఆయన నెల్లూరులో ఉన్న తన మరదలు కామేశ్వరికి ఫోన్‌చేసి చెప్పారు. ఆమె తన భర్తతో కలిసి లావణ్య ఇంటికి వెళ్లి చూడగా తలుపులు లోపల గడియపెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లి చూడగా లావణ్య చీరతో ఫ్యానుకు ఉరి వేసుకొని వేలాడుతూ కన్పించింది. వెంటనే ఆమెను కిందకు దించి నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి నెల్లూరుకు చేరుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ సేవకు పురస్కారం

● ఎస్పీ ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం



ఎస్సై జీవీ.చౌదరికి ప్రశంసాప్రత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వరరావు

పర్చూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను సమయంలో పర్చూరులోని ఓ ప్రార్థనా మందిరంలో వరద నీటిలో చిక్కుకు పోయిన 20 మందిని రక్షించడంతోపాటు, మరో యువకుడిని డ్రోన్ సహాయంతో కాపాడిన ఎస్సై జీవీ.చౌదరిని ఎస్పీ ఉమా మహేశ్వరరావు అభినందించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడిన ఎస్సై సేవలను ఎస్పీ కొనియాడారు. శనివారం ఆయన కార్యాలయంలో ప్రసంసాప్రత్రం అందజేసి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఏలూరి పరామర్శ

ఉప్పుటూరు(పర్చూరు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కొమ్మనబోయిన రాఘవయ్య, సింగమ్మ కుటుంబ సభ్యులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరామర్శించారు. శనివారం పార్టీ నాయకులతో కలసి వారి నివాసానికి వెళ్లి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో ఇరువురు వృద్ధులు ఇలా మృతి చెందడం బాధాకరమన్నారు.

శతాధిక వృద్ధురాలి చిత్రపటానికి ఏలూరి నివాళి

పర్చూరు మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొల్లా నాగరత్నమ్మ(106) శుక్రవారం మృతి చెందగా శనివారం స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక నేతలు ఉన్నారు.

సేవకు అత్యుత్తమ గుర్తింపు

● సీఎం చేతుల మీదుగా అవార్డులు



అవార్డు అందుకుంటున్న మస్తాన్‌రావు

పర్చూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను సమయంలో విశిష్ట సేవలు అందించిన పర్చూరు మండలంలోని ఇద్దరు అధికారులు అవార్డులు దక్కాయి. పర్చూరు పంచాయితీ కార్యదర్శి అళ్ళ మస్తాన్‌రావు, నూతలపాడు డిజిటల్ అసిస్టెంట్ గోపీలకు అవార్డులు వరించాయి. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇద్దరు అధికారులు అవార్డులు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. తుఫాను సమసయంలో విశిష్ట సేవలు అందించి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డుల అందుకున్న అధికారులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా అభినందించారు.


రచనా రంగంలో హనుమారెడ్డి కృషి అభినందనీయం



నివాళులు అర్పిస్తున్న సేవా సంఘాల ప్రతినిధులు

అద్దంకి,నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు భీమనాథం హనుమారెడ్డి రచనా రంగంలో చేసిన కృషి ఎంతో ఉన్నతమైనదని పొన్నూరి వెంకటశ్రీనివాసులు అన్నారు. ఆర్టీసీ వి శ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రా త్రి స్థానిక చిన్ని శాంతయ్య భవన్ లో హనుమారెడ్డి, సినిమా దర్శకులు ఆదుర్తి సుబ్బారావుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పిసిహెచ్ కోటయ్య, కొల్లా భువనేశ్వరి, అన్నంనేని వెంకటరావు,పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, కాకాని రాధాకృష్ణమూర్తి, లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య,చెన్నుపాటి రామాంజనేయులు, మలాది శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్రరావు, పంతంగి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ సుబ్బరాజుకు సేవాపత్రం



సేవాపత్రం అందుకుంటున్న సుబ్బరాజు

అద్దంకి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో గుండ్లకమ్మ నది వరద నీటిలో చిక్కు కున్న ముగ్గురు మున్సిపల్ కార్మికులు, మరో ముగ్గురు జాలర్లను రక్షించేందుకు అద్దంకి సీఐ సుబ్బరాజు కృషి చేశారు. ఈ నేపథ్యంలో శనివారం అమరావతి లో జరిగిన కార్య క్రమంలో సిఐ సుబ్బరాజు సీఎం చం ద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సిఐ సుబ్బరాజు ను అభినందించారు.

అవీ..ఇవీ..

వంతెన పనులు పూర్తికావడంపై ప్రజలు హర్షం


పూర్తయిన హైలెవల్ వంతెన

బల్లికురవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కాలువపై నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెన పనులు తుది దశకు చేరాయి. రెండురోజుల నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగించారు. దీంతో మూడు మాసాల నుంచి బల్లికురవ అద్దంకి రోడ్డులో రాకపోకలకు పడుతున్న కష్టాల నుంచి విముక్తి లభించింది. వల్లాపల్లి సమీపంలోని ఏబీసీ కాలువపై వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో హైలెవల్ వంతెన ఏర్పాటు చేశారు. ఈ వంతెన పనులు 90 శాతం పైబడి పూర్తయ్యాయి. రెండురోజుల నుంచి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాగానే ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎంఆర్‌సీ కార్యాలయంలో రికార్డుల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

బల్లికురవ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండల విద్యావనరుల కేంద్రాన్ని విద్యాశాఖ డిప్యూటీ ఈవో గంగాధర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం పాఠశాలలకు అందిస్తున్న అన్ని రకాల వస్తువులను సకాలంలో అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ప్రతిరోజు ఎంఈవోలు పాఠశాలలను తనిఖీలు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీలు చేయాలన్నారు. ఈ తనిఖీలో ఎంఈవో రమేష్ తదితరులు ఉన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- వాడరేవు హైస్కూల్‌ను సందర్శించిన జిల్లా అధికారి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి శివకుమార్

వాడరేవు(చీరాల), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ పేర్కొన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పది పరీక్షలు నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తీర్ణతపై మెలకువలు చెప్పారు. ఆయన వెంట ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మీర్జాన్ తదితరులు ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ఒకేషనల్ అవార్డులు



సన్మానం చేస్తున్న రోటరీసభ్యులు

ఇంకొల్లు, నవంబరు 1,(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో వృత్తిలో నైపుణ్యం కనబరిచిన వారికి స్థానిక రోటరీ గంగలో శనివారం ఒకేషనల్ అవార్డులు అందజేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అల్లంనేని అనంతలక్ష్మీ, పోలీసు విభాగంలో ఇంకొల్లు ఎస్సై గుడిపల్లి సురేష్, సామాజిక సేవ విభాగంలో చుండి చినమస్తాన్‌రావు, బ్యాంకింగ్ విభాగంలో యూనియన్ బ్యాంకు మేనేజరు వలేరు రవిబాబుకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. పేర్ని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, కోశాధికారి గోరంట్ల నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

యద్దనపూడి, (మార్టూరు)నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్ల ఏకాదశి (చిలుక ఏకాదశి) సందర్భంగా శనివారం యద్దనపూడి మండలంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో చెన్నయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి ఏకాదశి అలంకరించారు. మహిళా భక్తులు అష్టాదశోధ్యాయ భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

భావనారాయణుడికి లక్షతులసీదళ పూజ


తులసీ దళాలతో స్వామివారికి పూజలు

చినగంజాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భూసమేత భావనారాయణస్వామి ఆలయంలో ప్రబోధిని ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రబోధిని ఏకాదశిని (చిలకా ఏకాదశి) పురస్కరించుకుని శనివారం రాత్రి ఆలయంలోని దేవతామూర్తులను ఆలయ అర్చకులు ఏఎంఎల్ నరసింహాచార్యులు లక్ష తులసీ దళాలతో, వివిధ రకాల పూలలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తులసి విశిష్టతను గురించి ఆలయ పూజారి భక్తులకు వివరించారు. ఆదివారం క్షీరాబ్ధిద్వాదశి, చిలుకాద్వాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని ఉసిరిచెట్టు సమీపంలో కార్తీక మాస వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటి సభ్యు లు వీ.శివనారాయణ, వెంకటరామానుజం, విశ్వనాథబాబు, ఆలయ సేవా దళ్ సభ్యులు గుద్దంటి పిచ్చయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- పంట పొలాలను పరిశీలించిన అధికారులు
- ప్రభుత్వం దృష్టికి నష్టం అంచనా


వీరన్నపాలెం వద్ద వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఆయన ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. పైర్లు దెబ్బతిన్న రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మండలంలోని నాగులపాలెం, ఉప్పుటూరు, వీరన్నపాలెం, పోతుకట్ల, కొమర్నేని వారిపాలెం గ్రామాల్లో పర్యటించి తుపాను వల్ల దెబ్బతిన్న ఇళ్లు, పంటను పరిశీలించారు. నియోజకవర్గంలో ప్రత్తి, వరి, మినుము, మొక్కజొన్న, జూట్ పంటలకు నష్టం జరిగిందన్నారు. తుపాను వలన దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను తక్షణమే చేపట్టాలని సంబంధిత ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై దృష్టి

బర్లీ పొగాకు రైతుల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి మిగిలి ఉన్న పొగాకును కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. పొగాకును కొనుగోలు చేసేవిధంగా ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీచేశారన్నారు.

మిరపతోటల పరిశీలన

పంగులూరు : మండలంలోని బూదవాడ గ్రామంలో మొంథా తుపానుతో దెబ్బతిన్న మిరప, మినుము పంటలను ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి, ఉద్యానఅధికారి దీప్తి శనివారం పరిశీలించారు. మినుము, మిరప పంటలకు జరిగిన నష్టాన్ని రైతులు అధికారులకు వివరించారు. కొంత పొలంలో మిరపకు అధికమొత్తంలో నష్టం వాటిల్లినట్లు గుర్తించామని హెచ్‌వో దీప్తి తెలిపారు. మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పూర్తిగా నమోదుచేసి, నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా సిబ్బంది అంచనాలను రూపొందించాలని ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి సిబ్బందికి సూచించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వర్షానికి వడబడి ఒరిగిన మిరపను కాపాడుకొనేందుకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఉద్యాన శాఖ అధికారి దీప్తి సూచించారు. ఉరకెత్తిన పొలంలో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10గ్రాముల యూరియా, 10గ్రాముల పంచదార కలిపిన వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలు వడబడి తలలు వాలినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పైపాటుగా ఎకరానికి అదనంగా 30కిలోల యూరియా, 15కిలోల పొటాష్, 200కిలోల వేపపిండి వేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దెబ్బతిన్న మిరప తోటలను గుర్తించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



బూదవాడలో మిరపను పరిశీలిస్తున్న అధికారులు, నూతలపాడులో పొలాలను పరిశీలిసున్న లవన్న

బల్లికురవ : మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలతో 33 శాతం మేర పంట దెబ్బతింటే పంట నష్ట జాబితాలో నమోదు చేయాలని ఏవో శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలోని వేమవరం గ్రామం లో పత్తి పంటను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. వర్షాల వలన దెబ్బతిన్న పంటల వివరాలను నిష్పక్ష్యపాతంగా నమోదు చేయాలన్నారు. పంటలు దెబ్బ తిన్న రైతుల వివరాలు మాత్రమే ఉండాలన్నారు. జాబితాలు సిద్ధం అయ్యాక సచివాలయాలలో ఉంచుతామన్నారు. ఎక్కడ అవకతవకలు చోటుచేసుకోకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పంట నష్ట జాబితాలను నమోదు చేస్తున్నామని తెలిపారు.

నష్టపరిహారం అందించేందుకు చర్యలు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

నూతలపాడు(పర్చూరు) : మొంథా తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. శనివారం మండలంలోని నూతలపాడు గ్రామంలో ఏవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. త్వరితగతిన పైర్లను పరిశీలించి, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యం.. స్తంభించిన ట్రాఫిక్


ఎదురెదురుగా నిలిచిన ఆర్‌టీసీ బస్సులు

పేరాల(చీరాల), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన శనివారం సాయంత్రం పేరాల కారంచేడు రైలు గేటు వద్ద చోటుచేసుకొంది. రైళ్ల రాకపోకల కారణంగా కారంచేడు రైలు గేటు కొద్దిసేపు పడింది. దీంతో చీరాల నుంచి బాపట్ల, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నాయి. అదే సమయంలో చీరాల నుంచి రేపల్లె వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా కుడివైపు రాంగ్ రూట్‌లో బాగా ముందుకు వెళ్లాడు. అయితే అదేసమయంలో ఎదురుగా గుంటూరు నుంచి చీరాలకు వస్తున్న మరో ఆర్టీసీ బస్సు వచ్చింది. దీంతో రెండు బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. పైగా రెండు బస్సుల కారణంగా ట్రాఫిక్ నిలిచి ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఇద్దరు డ్రైవర్లు 'నీ బస్సు పక్కకు తీయమంటే, నీ బస్సు తీయి' అని వాగ్వాదానికి దిగారు. దీంతో గుంటూరు బస్‌డ్రైవర్ ఏకంగా బస్ దిగి కిందకు వెళ్లి దూరంగా నిలబడ్డాడు. కొద్దిసేపటికే రేపల్లె డస్ డ్రైవర్ చేసేదేమీ లేక బస్‌ను వెనక్కు తీయడంతో సమస్య సద్దుమణిగింది. అయితే ఇదంతా చూస్తున్న ప్రజలు బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యంపై చివాట్లు పెడుతున్నారు. అధికారులు ఘటనపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను అభినందించిన సీఎం

- నియోజకవర్గంలో ఉత్తమ సేవలకు అభినందన


సీఎం చేతలు మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న ఎమ్మెల్యే

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొండయ్యను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో పంట పొలాలు, నివాసాలు, చేనేత మగ్గాల్లో సైతం మోకాళ్ల లోతుల్లో నీళ్ల చేరి ప్రజలు భీతిల్లారు. వాడరేవు - రామాపురంలో మూడు వంతెనలు సైతం కుప్పకూలాయి. దీంతో సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే ఇబ్బందుల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలు అందించారు. దీంతో శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేను అభినందించారు. ప్రశంసపత్రం అందజేశారు.

పొలాల్లో నీరు బయటకు పంపే ఏర్పాట్లు చేయండి

ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచన


కడవకుదురులో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చినగంజాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో ముంపు బారిన పడిన పొలాల్లో నీటిని తక్షణం బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రబావంతో మండల పరిధిలోని కడవకుదురు, గొనసపూడి ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలను, కొమ్మమూరు, రొంపేరు కాలువలను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. సుమారు మూడు వేల ఎకరాల వరి పంట నీటిలో మునిగిందని, ఐదు రోజులుగా నీరు తగ్గలేదని చీరాల ఏడీఏ రత్నకుమారి కలెక్టర్‌కు వివరించారు. మూడు రోజుల తర్వాత కూడా నీరు తగ్గకుంటే ఆ వరి పొలాలను నమోదు చేయాలని ఏవోను కలెక్టర్ ఆదేశించారు. పొలాలు ఎన్ని రోజుల నుండి వరద నీటిలో ఉన్నాయి, నీరు బయటకు పోవడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందని రైతులను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. వరిపొలాలు నీటమునిగి ఇప్పటికే ఐదు రోజులు అయిందని, వరద నీరు పూర్తిగా పోవాలంటే వారం రోజులు పడుతుందని, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద తగ్గితేనే పొలాలు బయట పడతాయని రైతులు కేశన బాలయ్య, జి.తిరుపతిరావు, నక్కల సుబ్బారావు, వడ్లమూడి రామకష్ణ, తోటకూర రాజేష్‌లు కలెక్టర్‌కు వివరించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందజేస్తామని అన్నారు. పొలాలలో నిలిచిన నీటిని ఏ విధంగా తొలగించాలన్న ప్రణాళికలు తయారు చేయాలని, డ్రోన్స్‌ను ఉపయోగించి ఎక్కడ నీటిని తొలగించే అవకాశం ఉంటే అక్కడ నుండి నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రొంపేరు, కొమ్మమూరు కాలువల ద్వారా ప్రవహించే వరదనీటిని ఆయన ఇరిగేషన్ శాఖధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, మండల సర్వేయర్ లోకేష్, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, చింతగుంపల్లె పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వన్‌గ్రాం గోల్డ్ బంగారం చోరీపై కేసు నమోదు

- ఆభరణాల కొంటున్నట్లు మభ్య పెట్టి చోరీకు పాల్పడిన మహిళలు
- అపహరణ వస్తువులు విలువ రూ.55 వేలు

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వన్‌గ్రామ్ గోల్డ్ అపహరించిన సుమారు పది మంది గుర్తు తెలియని మహిళలపై శనివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్బార్ రోడ్డులోని స్టేట్ బ్యాంకు సమీపంలోని వన్‌గ్రామ్ గోల్డ్ షాపులోకి శుక్రవారం మధ్యాహ్నం మహిళలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. అయితే పథకం ప్రకారం యజమానిని మభ్యపెట్టి సుమారు రూ.55 వేల విలువైన వస్తువులు అపహరించారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం పంచాయతీ కార్యాలయంలో రోటరీ సభ్యులు దుప్పట్లును పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోటరీ సభ్యులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, రావి అంకమ్మ చౌదరి, దొడ్డా మహేంద్ర, కొర్రపాటి సుబ్రహ్మణ్యం, గోనుగుంట్ల రవికుమార్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు


అద్దంకిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): బాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు అని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు అలహరి హరిప్రసాద్, శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, ఊటుకూరి రామకోటేశ్వరరావు, సంకా సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. 1953 నవంబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడగా, ఆనాడు రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాలను విద్యార్థులకు ప్రధానో పాధ్యాయులు పిడపర్తి పేరిరెడ్డి వివరించారు. ఆయన నిరాహారదీక్ష రాష్ట్ర అవతరణకు ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు నివాళి

పర్చూరు : ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్చూరులోని స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పీఠం ఆహ్వానం

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నేడు లయన్స్ క్లబ్ సర్వీసు ట్రస్టు భవనంలో 'ప్రపంచం - పరమాత్ముడు' ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చీరాల ఆధ్యాత్మిక పీఠం ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 5.30. ని. నుండి ప్రారంభమయ్యే కార్యక్రమంలో భక్తులు పాల్గొని కోరారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

ఇంకొల్లు, నవంబరు 1,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో మొంథా తుపాను అనంతరం వరద బాధత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను శనివారం షహనాజ్ అనే మహిళకు అందజేశారు. 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, తహసీల్దారు శ్రీనివాస్, నాయకులు కరి శ్రీనివాసరావు, మాబాష, మార్క్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ట్రూడౌన్ చార్జీలు ప్రారంభం


విద్యుత్ బిల్లులు పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయం తో విద్యుత్ చార్జీల తగ్గింపు(ట్రూడౌన్ చార్జీలు) ప్రారంభమయ్యాయని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి పట్టణంలో పలు ప్రాంతాలలో శనివారం రాత్రి ఈఈ మస్తాన్‌రావు విద్యుత్ బిల్లులు పరిశీలించారు. 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి వరకు విద్యుత్ వినియోగం కు సంబంధించి యూనిట్ కు 13 పైసలు చొప్పున లెక్కించి నవంబరు 2025 నుండి అక్టోబరు 2026 వరకు తగ్గించి బిల్లులు వస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి ట్రూడౌన్ చార్జిలు అమలు లోకి తీసుకు వచ్చారన్నారు. డిఈఈ దామోదరం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి : విద్యుత్ కొత్త టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని కొత్తదామావారిపాలెం, భవానిసెంటర్‌లో రేణింగవరం రోడ్డు, కాకానిపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

ఇద్దరు హాస్టల్ విద్యార్థులు అదృశ్యం

అద్దంకి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఇద్దరు హాస్టల్ విద్యార్థులు అదృశ్యం అయ్యారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని వెంపరాలకు చెందిన గరిగల ధనూష్, కొత్తరెడ్డిపాలేనికి చెందిన పోతిరెడ్డి సుబ్బారెడ్డిలు అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం హైస్కూల్‌లో 10 వ తరగతి చదువుతూ పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నారు. శనివారం ఉదయం హాస్టల్ నుండి స్కూల్‌కు వెళ్ళిన ఇద్దరు విద్యార్థులు పాఠశాల గేటు వరకు వెళ్లి పెన్ను కొనుక్కొని వస్తామని తోటి స్నేహితులతో చెప్పి వెళ్లిపోయారు. సాయంత్రం పాఠశాల వదిలిన తరువాత కూడా విద్యార్థులు హాస్టల్ కు రాకపోవడంతో హెచ్‌డబ్ల్యూవో వీరాస్వామి విచారించగా పాఠశాలకు వెళ్లకుండా బయటకు వెళ్ళిపోయినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులకు ఫోన్ చేయగా ఇళ్లకు రాలేదని చెప్పారు. దీంతో హెచ్‌డబ్ల్యూవో వీరాస్వామి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయటం తో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.


రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం స్టూవర్టుపురం - బాపట్ల రైల్వే స్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. దీంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతునికి సుమారు 35 సంవత్సరములు ఉంటాయని, కుడి చేతిపై మామ్, డాడ్ అని, ఎడమ చేతిపై నేహా అని పచ్చబొట్టు ఉన్నట్లు చెప్పారు. వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

నిలిచిన విద్యుత్ సరఫరా


కొండమూరు గ్రామ సమీపంలో నేలవాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పంగులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమూరు గ్రామ సమీపంలో మొంథా తుపాను తాకిడికి విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ నేలపై పడిపోయింది. దీంతో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 5 విద్యుత్ మోటార్లకు విద్యుత్ సరఫరా అందుతోంది. సమస్యను గుర్తించి సంబంధిత అధికారులు తిరిగి పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



93.26 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం); నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం 93.26 శాతం సామాజిక పెన్షన్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ వి.నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 3,04,749 పెన్షనర్లకుగాను 2,84,214 మందికి పింఛన్ల సొమ్ము అందజేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 20,535 మందికి పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కాగా, మర్రిపాడు మండలం డీసీపల్లిలో కలెక్టర్ హిమాన్షు శుక్లా లబ్ధిదారులకు పింఛను సొమ్ము స్వయంగా అందజేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది నగదు అందజేశారు.



డీసీ పల్లిలో ముగిసిన పొగాకు అమ్మకాలు

10.27 మిలియన్ కేజీల అమ్మకం • రూ.226 కోట్ల వ్యాపారం

మర్రిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు బోర్డులో పొగాకు అమ్మకాలు శనివారం ముగిశాయి. బోర్డు పరిధిలోని 10 మండలాల్లో 1,785 బ్యారన్‌లు 2,081 మంది రైతులు ఈ ఏడాది బోర్డులో రిజిస్టర్ చేసుకున్నారు. ఈ ప్రకారం 7.47 మిలియన్ కేజీలను కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది కేజీ ధర రూ.270తో ప్రారంభమై రూ.358లతో ముగిసింది. అనుమతి మేర ఆగస్టు 23వ తేదీ నాటికి బోర్డులో కొనుగోలు పూర్తి చేశారు. అనంతరం రైతులు అదనంగా పండించిన పొగాకును కొనుగోలు చేయాలని కేంద్ర వాణిజ్య శాఖను రైతులు అనుమతి కోరారు. దీంతో స్పందించిన స్పందించిన ఆ శాఖ రైతు వద్ద ఉన్న కొంత మొత్తం పొగాకును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా, మరికొంత పొగాకును అపరాధ రుసుంతో సెప్టెంబరు 8వ తేదీ నుంచి తిరిగి కొనుగోలు ప్రారంభమై శనివారం ముగిసింది. దీంతో ఈ ఏడాది బోర్డులో 10.27 మిలియన్ కిలోల పొగాకును వివిధ కంపెనీలు రూ.226 కోట్లకు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

విజయవాడ-బెంగళూరు మధ్య 544జీ హైవే నిర్మాణం • ఇందులో 3.7 కి.మీ పొడవున సొరంగ మార్గం • నెల్లూరు-కడప సరిహద్దు ప్రాంతంలో వేగంగా పనులు • 2027 ఫిబ్రవరిలోగా పనుల పూర్తికి కసరత్తు

సింహపురి సిగలో మరో సొరంగమాల

SUNDAY SPECIAL

జిల్లాలో మరో సొరంగ మార్గం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వే మార్గంలో 6.7 కి.మీ పొడవున సొరంగ మార్గం ఉంది. తాజాగా విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ 544-జీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దు ప్రాంతమైన సీతారామపురం సమీపంలో మరో సొరంగ మార్గం నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. 518 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారిని నిర్మిస్తుండగా అందులో భాగంగానే సీతారామపురం వద్ద ఉన్న కొండను తొలచి రెండు సొరంగ మార్గాలను నిర్మిస్తున్నారు. సుమారు రూ.857.75 కోట్లతో మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ పనులు చేస్తోంది.

ఉదయగిరి/సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జాతీయ రహదారి నిర్మాణాల్లో నిర్మించిన సొరంగ మార్గాల్లో సీతారామపురం వద్ద నిర్మిస్తున్న సొరంగ మార్గం అతి పెద్దది. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రెండు వరుసల సొరంగ మార్గాలు నిర్మిస్తున్నారు. అటు కడప, ఇటు నెల్లూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఒక్కో సొరంగ మార్గాన్ని 16.7 మీటర్ల వెడల్పు, 9.8 మీటర్ల ఎత్తుతో 3.7 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్నారు. ఈ పనులను మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ రూ.857.75 కోట్లతో దక్కించుకుంది. 2027, ఫిబ్రవరి నెలలోపు ఈ పనులు పూర్తికానున్నాయి. ప్రస్తుతం ఇరువైపులా అర కిలోమీటరు మేర పనులు పూర్తయ్యాయి.

● తగ్గనున్న దూరం..

167-బీజీ, 167-బీ, 565 జాతీయ రహదారులకు సమీపాన బెజవాడ-బెంగళూరు వరకు 518 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతుండడంతో వాహనదారులకు దూరం తగ్గడంతోపాటు సమయం ఆదా కానుంది. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లా వాసులకు విజయవాడ, బెంగళూరు వెళ్లేందుకు సుమారు 100 కిలోమీటర్లపాటు దూరం తగ్గడంతోపాటు 3 గంటలు ఆదా అవుతుంది. ఈ రహదారిపై ఏకంగా 120 కిలోమీటర్ల వేగంతో వాహనదారులు రాకపోకలు సాగించవచ్చు. అనంతపురం జిల్లా కొడికొండ వద్ద ప్రారంభమయ్యే ఈ రహదారి నిర్మాణం వైఎస్ఆర్, నెల్లూరు, ప్రకాశం జిల్లాల మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం గ్రామం వద్ద జాతీయ రహదారి-16లో కలుస్తుంది. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి పలు ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. అవసరమైన ప్రదేశాల్లో అండర్‌పాస్‌లు, వంతెనలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ హైవే పనులు పూర్తయితే పలు జిల్లాల వాసులకు బెంగళూరు-విజయవాడకు మార్గం మరింత సుగమం అవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సీతారామపురం వద్ద అటవీ ప్రాంతంలో జరుగుతున్న సొరంగ మార్గం పనులు | నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతంలో సొరంగ మార్గం



సంగం బ్యారేజీలో దెబ్బతిన్న బ్యారేజ్ గేటు

వరద ప్రవాహానికి దెబ్బతిన్న బ్యారేజీ గేట్

సంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి వస్తున్న వరద ప్రవాహం ఒత్తిడితో 13వ గేటు దెబ్బతిని కిందకు దిగడంలేదు. ప్రియర్స్ ఒకవైపు బీమ్ వద్ద ఇరుక్కుంది. దీంతో గేటు అటు కిందకు, పైకి కదలడం లేదు. బ్యారేజీకి వరద ప్రవాహం రాకముందే కుడి, ఎడమ వైపు ఉన్న స్కవర్ వెంట్స్ తప్ప బ్యారేజ్‌లో ఉన్న మిగతా 79 గేట్లన్నీ ఎత్తేశారు. దీనివల్ల వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు వెళ్లే అవకాశం ఏర్పడింది. ఈ క్రమంలో 28వ తేదీన డ్రెడ్జింగ్ పడవ కొట్టుకు వచ్చి బ్యారేజీకి ఎగువ భాగం పాత ఆనకట్ట క్రస్ట్ వద్ద ఆగిపోయి బ్యారేజీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. అయితే దీన్ని తొలగించేందుకు బ్యారేజ్‌లో సుమారు 60 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న సమయంలో రెండు పర్యాయాలు గేట్లు దించి మళ్లీ ఎత్తే క్రమంలో బీమ్ కాంక్రీట్ దెబ్బతిని గేటు ఒక వైపు కిందకు దిగకుండా ఆగిపోయింది. దీనికి తక్షణమే బ్యారేజ్‌లో ఉన్న స్టాప్‌లాక్ వినియోగించి దెబ్బతిన్న బీమ్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. కాగా, బ్యారేజీకి సోమశిల, బీరాపేరు, బొగ్గేరు నుంచి శనివారం సుమారు 1.16 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో నీటి నిల్వ 12.1 అడుగులు నమోదయింది. బ్యారేజ్‌కు చేరుతున్న నీటిని గేట్ల ద్వారా నెల్లూరు బ్యారేజ్‌కు యథావిధిగా విడుదల చేస్తున్నారు.

● 'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం 48,460 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 47,650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యాంలో 69.635 టీఎంసీలు నిల్వ ఉంది. వచ్చే ప్రవాహం ఆదివారానికి మరింత తగ్గే సూచనలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

● రాపూరు : కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.78 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 840 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కులను బయటకు వదులుతున్నట్లు తెలిపారు.



మద్రాసు బస్టాండు వద్ద..



కూరగాయల మార్కెట్ వద్ద..



డీకే కళాశాల కూడలి వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ట్రాఫిక్ సిగ్నల్స్ వచ్చేశాయ్!

- నెల్లూరులో ఏడు కూడళ్ల వద్ద ఏర్పాటు
- త్వరలో అమల్లోకి నిబంధనలు

నెల్లూరు (సిటీ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ట్రాఫిక్ సిగ్నల్స్.. ఈ మాట అప్పుడెప్పుడో విన్నమాట. ఈ తరం యువతకు అస్సలు గుర్తు కూడా ఉండదు. వాహనాల రద్దీ పెరుగుతుందే కానీ రోడ్ల విస్తరణ జరగడం లేదు. దీంతో నగరంలోకి వాహనాలను తీసుకురావాలంటే యుద్ధమే చేయాలన్నంతగా కష్టపడాలి. ఏ రోడ్డుమీదకు వెళ్లినా.. ఏ కూడలి వద్ద చూసినా నిత్యం ట్రాఫిక్ జామ్. దీనిని నియంత్రించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. 2023లో పునాది వేసుకున్న ఈ కృతువు ఇప్పుడు అందుబాటులోకి రానున్నది. నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, డీకే కళాశాల కూడలి, హరనాథపురం జంక్షన్, కేవీఆర్ కూడలి, కనకమహల్ సెంటర్, రామలింగాపురం జంక్షన్, వీఆర్సీ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి రూ. 1.40 కోట్లను కేటాయించిన యంత్రాంగం అందులో ఇప్పటివరకు. రూ.50 లక్షలను నిర్వహణ కంపెనీ ఎస్పీటీ నెట్‌వర్క్‌కు చెల్లించారు. సదరు కంపెనీ ఏడు ప్రాంతాలలోని కూడళ్ల వద్ద సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తోంది. లైట్ల అమరిక పూర్తవగా కేబుల్ ఏర్పాటు జరుగుతోంది. ఇవన్నీ పూర్తయితే అతి త్వరలోనే నగరంలో ట్రాఫిక్ సిగ్నలింగ్ అందుబాటులోకి వస్తుంది.

● 'సుప్రీం' ఆదేశాలతో...

దేశవ్యాప్తంగా వాహనాల రద్దీతో ప్రజలు ఇబ్బంది

- మిగతా 8లో..



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న కమిషనర్లు నందన్, శ్రావణ్‌కుమార్, అనుష

శభాష్.. బాగా పని చేశారు!

● నెల్లూరు, కావలి, కందుకూరు కమిషనర్లకు సీఎం ప్రశంసలు

నెల్లూరు (సిటీ)/కావలి/కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌లో సమర్థవంతంగా పని చేసినందుకు నెల్లూరు కార్పొరేషన్, కావలి, కందుకూరు మున్సిపల్ కమిషనర్లు నందన్, శ్రావణ్‌కుమార్, అనుషలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన సైక్లోన్ మొంథా ఫైటర్ కార్యక్రమంలో కమిషనర్లకు సీఎం ప్రశాంసాపత్రాలు అందజేశారు. ఇటీవల మొంథా విపత్తులో యం త్రాంగం సమర్థవంతంగా పని చేసిందం టూ చంద్రబాబు కొనియాడారు. సీఎం వద్ద ప్రశంసలు అందుకున్న కమిష నర్లకు అధికా రులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

వాట్సాప్ గ్రూప్‌ల అడ్మిన్లకు పోలీసుల నోటీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ వాట్సప్ గ్రూప్‌ల అడ్మిన్‌లకు పోలీసు అధికారులు నోటీసులు ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని నివారించేందుకు, ప్రజాశాంతి భద్రతలను కాపాడేందుకు బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 168 ప్రకారం సూచనలు పాటించాలని ఆదేశిస్తున్నారు. అడ్మిన్‌లు తమ గ్రూప్ పేరు, చిరునామా, మొబైల్ నెంబర్లు, సభ్యుల సంఖ్య, గ్రూప్ ఏర్పాటు ముఖ్య ఉద్దేశం తదితర వివరాలను అందజేయాలని నోటీసులలో పేర్కొన్నారు. అనుచితమైన, దూషణాత్మక, తప్పుదారి పట్టించే, మత విద్వేషాన్ని రేకెత్తించే, చట్టవిరుద్ధమైన కంటెంట్ వంటివి కనిపిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించి సమీప పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని గ్రూప్ అడ్మిన్‌లకు సూచించారు. చట్ట ఉల్లంఘన జరిగితే బీఎన్‌ఎస్‌ఎస్, ఐటీ చట్టం, ఇతర చట్టాల ప్రకారం న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులలో హెచ్చరికలు జారీ చేశారు.





ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే అవస్థలే

కన్నీటి తీరం!

వరద నీటితో పెన్నమ్మ ఉరకలేస్తుండటంతో నదీపరివాహక ప్రాంతవాసులకు కంటి మీద కనుకులేకుండా పోయింది. ఏ వైపు నుంచి వరద ముంచెత్తుతుందోనని భయాందోళనకు గురయ్యారు. నగర శివార్లలోని పాత చెక్‌పోస్టు వద్ద వరద నీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. కనీసం ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. కొంతమందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, పెన్నాలో వరద తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- జాకీర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



నీటిలో బతుకుబండి..

పొగరాయుళ్లపై కొరడా

- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- పొగతాగితే రూ. 200 జరిమానా
- జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో అవగాహన
- రెండునెలలపాటు విస్తృత కార్యక్రమాలు

8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

రాళ్లపాడును వేధిస్తున్న సిబ్బంది కొరత

లింగసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులకు తాగు, సాగునీటిని అందించే రాళ్లపాడు ప్రాజెక్టులో ఏళ్ల తరబడి సిబ్బంది వేధిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండిన ప్రతిసారీ ఒకరిద్దరు అధికారులను, కొందరు ఎన్ఎంఆర్‌లను తాత్కాలికంగా నియమించుకొని మమ అనిపిస్తున్నారు. దీంతో పైర్ల సాగు సమయంలో నీటి నిర్వహణ సక్రమంగా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టుకు వరదలు వచ్చే సమయంలో అధికారులు, సిబ్బంది కొరతతో ఉన్న కొద్దిమంది అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఒక అటెండరు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. గతంలో కందుకూరు మైనర్ ఇరిగేషన్ శాఖ నుండి ఒక ఏఈని ప్రాజెక్టుపై ఇన్‌చార్జ్ ఏఈగా నియమించారు. అలాగే మొంథా తుఫాను నేపథ్యంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు నుండి ఇద్దరు ఏఈలను తాత్కాలికంగా నియమించారు. గతంలో బకింగ్‌హామ్ కెనాల్ నుండి ఇద్దరు లస్కర్లను డిప్యూటేషన్‌పై నియమించారు. కాగా, 10 మంది ఏఈలు, 14 మంది లస్కర్లు, 18 ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మాలకొండ ఆదాయం రూ.10,83,617

వలేటివారిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 10,83,617 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 16,350, కుంకుమార్చన ద్వారా రూ. 19,240, వివాహముల ద్వారా రూ. 17 వేలు, తలనీలాల ద్వారా రూ. 31,850, వాహన పూజల ద్వారా రూ. 2,840, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,55,800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 440, రూము అద్దెలు ద్వారా రూ. 27,990, కవర్లు ద్వారా రూ. 9,085, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 2,11,975, అన్నదానం ద్వారా రూ. 3,62,415, విరాళాల ద్వారా రూ. 28,632 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం



డీసీ చంద్రశేఖర్‌కు విరాళం అందజేస్తున్న మాల్యాద్రినాయుడు దంపతులు

మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అన్నదానానికి శనివారం కందుకూరుకు చెందిన మామిడాల మాల్యాద్రి నాయుడు ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్‌కు విరాళం అందజేశారు.

అయ్యవారిపల్లెలో పారిశుధ్య పనులు

వలేటివారిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లెలో పంచాయతీ సర్పంచి డేగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో గ్రామంలో వైరల్ జ్వరాలు ప్రబలకుండా ముదస్తుగా పారిశుధ్య పనులు చేపట్టారు వీధుల్లోని మురుగు కాల్వలు, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లించారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు పట్టారు. పారిశుధ్య పనులను ఎంపీడీఓ శంకర్‌రావు పరిశీలించారు.

అల్లూరులో ఎంపీ బీద

అల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు శనివారం అల్లూరులో జరిగిన పలు శుభ కార్యాలకు హాజరయ్యారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య నూతన గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం నడుస్తోందని, భవిష్యత్తులో రాష్ట్రానికి అనేక అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, తోట శ్రీహరి, అరగల రమణయ్య, తోట శీనయ్య, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

అమర లింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా వీరగంధం



సత్యన్నారాయణకు అభినందనలు తెలుపుతున్న సర్పంచి బసవయ్య నాయుడు

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకం శనివారం జరిగిందని ఈవో వీ రంగరాజు తెలిపారు. మన్నేటికోట మాజీ సర్పంచు వీరగంధం సత్యనారాయణను ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కందుకూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యన్నారాయణ ఆలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యులుగా దేవినేని రంగారావు, గొత్తుల క్రిష్టయ్య, మల్లవరపు గోపి, వాసిపల్లి వెంకయ్య, గొత్తుల శ్రావణి, కొండరాజు పద్మ, నాళం అలేఖ్యల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచు పులివర్తి బసవయ్య నాయుడు, గ్రామస్థులు నూతన చైర్మన్‌ను సన్మానించారు.

నిత్యావసరాల పంపిణీ

జలదంకి, నవంబర్1(ఆంధ్రజ్యోతి): శనివారం మండలంలోని చామదలలో 41 చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యంతోపాటు నిత్యావసరాలు తహసీల్దార్ ప్రమీలతో కలసి మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులతోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

కలిగిరి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కలిగిరిలో పర్వతవర్ధిని సమేత జానకి రామలింగేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామపెద్దలు, మండల వాసులు శ్రీకారం చుట్టారు. శనివారం ఆలయ ప్రాంగణంలో బాలాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.

దివ్యాంగుల కాలనీని వీడని వర్షపు నీరు



దివ్యాంగుల కాలనీలో నిల్వ ఉన్న వర్షపు నీరు

కావలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఊళ్లకు ఊళ్లు నీటమునిగాయి. ఈ నేపథ్యంలో వర్షాలు ఆగిపోయినా పట్టణంలోని దివ్యాంగ కాలనీని మాత్రం వర్షపు నీరు వీడడంలేదు. అసలే లోతట్టు ప్రాంతంలో ఉన్న ఈ కాలనీ.. ఇక్కడ రోడ్లు, డ్రైన్లు లేకపోవటంతో జలమయమైంది. వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాలు తరచూ మునకకు గురైనప్పటికీ ఆ తర్వాత వాన నీరు బయటికి ప్రవహిస్తుంది. అయితే రైల్వే ట్రాక్ పడమర వైపు ముసునూరులో ఉన్న దివ్యాంగుల కాలనీలో నేటికీ వాననీరు పెద్దఎత్తున నిల్వ ఉంది. కాలనీ నుంచి నీరు బయటకు వెళ్లేందుకు మున్సిపల్ అధికారులు తొలుత కాలువలు తీసి, తర్వాత వాటికి తూములు వేసి మూసివేశారు. అయితే పైపు ద్వారా నీరు బయటకు వెళ్లనీయకుండా దిగువ ప్రాంతం వారు మట్టికట్ట అడ్డు వేయటంతో వరద నీరు అక్కడే నిలిచిపోయింది. దీంతో దివ్యాంగులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి నీరు బయటకు వెళ్లేలా వెంటనే ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రావతరణ

కావలి (టౌన్) నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బీపీఎస్ కూడలి ట్రంకురోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఓరుగంటి రామకృష్ణ, పాదర్తి నాగరాజు, గాదంశెట్టి మధుసూదన్‌రావు, నల్లూరు చందు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ కేంద్రకమిటీ సభ్యుడు కాటంరెడ్డి విష్ణవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంగళరావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బీ కోటేశ్వరి అధ్యక్షతన రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఎం. మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



కావలిటౌన్ : పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న తటవర్తి రమేష్, తదితరులు

● అమరజీవికి ఘన నివాళులు

కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములుకు అధికారులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పెద్దబజారులో ఉన్న పొట్టి శ్రీరాములు కాంశ్య విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చక్కా కేశవరావు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, తాతా లక్ష్మీనారాయణ, ఓరుగంటి శివశంకర్, ఇన్నమూరి శ్రీనివాసులు, కోట వెంకటనరసింహం, కోట కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణ పోలీసుస్టేషన్‌లో....

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కందుకూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. సీఐ అన్వర్‌బాషా, పట్టణ ఎస్ఐ శివనాగరాజు, పోలీసుసిబ్బంది అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో అధ్యాపకులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉలవపాడులో ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు బానపల్లి సుబ్రహ్మణ్యం, పొన్నూరు రామాంజనేయులు, మేడా అర్జున్ కుమార్, దివ్యానంద గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా అందచేయడమే లక్ష్యం

బిట్రగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా అందచేయడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తున్నదని పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు అన్నారు. బోగోలు మండలంలోని 16 పంచాయతీలో శనివారం పెన్షన్ల పంపిణీ చేశారు. విశ్వనాథరావుపేట, కొత్తూరు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి జాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, ముస్లీం మైనార్టీ మండల అధ్యక్షులు అహ్మద్‌భాషా, తదితరులు ఉన్నారు.

దగదర్తి (బిట్రగుంట): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల టీడీపీ నాయకుడు వడ్డే శ్రీకాంత్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి మయూరి, టీడీపీ నేతలు వీ వినయ్‌కుమార్, కే. వెంకట సురేష్, కే. వెంకటేశ్వర్లు, అవినాష్‌చౌదరి, ముప్పాళ్ళ తరుణ్, జీ.వికాస్, జీ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: మండలంలో శనివారం ప్రభుత్వ సిబ్బంది ఉదయాన్నే ఇంటింటికీ వెళ్ళి సామాజిక ఫింఛన్లు అందించారు. జలదంకిలో ఎంపిటిసి కుట్టుబోయిన మాదవరావు, తెలుగు యువత నాయకులు పి.మహేంద్రరెడ్డి, మారిబోయిన నారాయణలు ఫించను నగదు అందజేశారు. తిమ్మసముద్రంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు ఫించన్ల పంపిణీలో ప్రభుత్వ సిబ్బందితో పాల్గొని ఫించను నగదును అందించారు.

కొండాపురం: పింఛన్ల పంపిణీ శనివారం మండలంలో 90 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు మొత్తం 5400 మంది ఉండగా, 4860 మందికి శనివారం పంపిణీ చేశామన్నారు. మిగిలినవారికి సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరేడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. శనివారం తిరుపతి కుంట కాలనీవాసులకు సీజనల్ వ్యాధులపై సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది శ్రీనివాసరావు, ఏఎన్ఎం శోభ, ఎంఎల్‌హెచ్‌పీ మణెమ్మ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో పంటలకు అపార నష్టం

జలదంకి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాల ధాటికి మెట్టపైర్లు మినుము, పెసర పంటలు ఉరకెత్తాయి. వారం పాటు ఎడతెరిపిలేని వర్షాలు పడడంతో మండలంలోని గట్టుపల్లి, కేశవరం, అన్నవరం, చినక్రాక, వేములపాడు, కేశవరం, రామవరప్పాడు, చోడవరం పంచాయతీల లో రైతులు సాగు చేసిన మెట్టపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు పంటనష్టం పరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 52 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం. నరసింహమూర్తి, ఉపాధ్యాయులు రమణయ్య, పి. ప్రసాదరావు, ఎస్. మాధవరెడ్డి, సీఆర్ఎం టీచర్ ఎంవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలు తప్పనిసరి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాల బస్సుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలు తప్పనిసరి అని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలోని ఆర్టీవో కార్యాలయంలో శనివారం పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలతో అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం జరగ్గా, ఆయన మాట్లాడారు.

భక్తులకు మెరుగైన వసతులు : ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మాలకొండలో అన్నదాన సత్రం పక్కన రూ. 7,05440తో నిర్మించనున్న మరుగుదొడ్లకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. అంతకుముందు కొండకింద మొక్కలు నాటిన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దూరప్రాంతాల నుండి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా మెరుగైన వసతులు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని అశోక్, కూడలి భాస్కర్‌రావు, యల్లంపల్లి భరత్, పంది లక్ష్మీనరసింహం, చొప్పర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



మాలకొండలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు

● పింఛన్ల పంపిణీ

మండలంలోని అయ్యవారిపల్లెలో శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ శంకర్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచాల మల్లికార్జునరావు, సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు, నాయకులు యల్లంపల్లి భరత్, పాలేటి రవి, మంచాల మాలకొండ్రాయుడు, ఆవుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 పోటీలకు మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ జనార్దన్ తెలిపారు. ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన అండర్-17 బాలుర వాలీబాల్ జట్టు ఎంపికలో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వాయిల మహేష్, బసంగారి రాజేష్ ఎంపికయ్యారు. అదేవిధంగా ఏబీఎం జూనియర్ కళాశాలలో జరిగిన హ్యాండ్ బాల్ అండర్-17 జిల్లా జట్టుకు 10వ తరగతి విద్యార్థి సూరగాని గోకుల్ చంద్ ఉమ్మడి ప్రకాశం హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఈనెలలో రాజమండ్రి, తెనాలిలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీరాయి వెంకటసుధాకర్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు అభినందించారు.



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన చాకిచర్ల విద్యార్థులు

ఎమ్మెల్యే కాకర్ల ఆర్థిక సాయం

కొండాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిగుండాలకి చెందిన మండల ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పదర్ల హజరత్ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి పైకప్పునుండి నీరు కారుతుండటంతో కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆ కుటుంబం తలదాచుకోవాల్సివచ్చింది. ఈవిషయాన్ని తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన ట్రస్టు ద్వారా రూ. 20 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించగా, మండల టీడీపీ నాయకులు శనివారం ఆ నగదును బాధితుడు హజరత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు నాయుడు, యారవ క్రిష్ణయ్య, డీ రామమోహన్, అల్లిక మధు, తిరుపాల్‌రెడ్డి, పద్మారెడ్డి, రవీంద్రారెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హజరత్‌కు నగదును అందజేస్తున్న టీడీపీ నాయకులు

రాయితీపై యూరియా పంపిణీ

కొండాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట సొసైటీ పరిధిలోని రైతుసేవా కేంద్రంలో రాయితీపై యూరియాను సొసైటీ అధ్యక్షుడు అల్లిక మధు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. మార్కెట్‌లో ధర అధికంగా ఉండటంతో ప్రభుత్వం రాయితీపై రూ. 267కే రైతులకు యూరియాను అందజేస్తోందన్నారు. సొసైటీ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులకు 400 బస్తాల యూరియా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మండల టీడీపీ కో ఆర్డినేటర్ పోలినేని చంద్రబాబునాయుడు, డీ రామమోహన్, వేమిరెడ్డి నరసారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● అధిక వాడకం వల్ల నష్టమే!

బిట్రగుంట,నవంబరు1 (ఆంధ్రజ్యోతి): అధికంగా యూరియా వాడకం వల్ల రైతుకు నష్టమేనని మండల వ్యవసాయ అధికారిణి బీ శైలజ అన్నారు. బోగోలు మండల వ్యవసాయ కార్యాలయంలో అల్లిమడుగు, కోవూరుపల్లి పంచాయతీలకు చెందిన రైతులకు శనివారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. యూరియా అధికంగా వాడటం వల్ల నేల చౌడుగా మారే ప్రమాదం ఉందని, పైరుకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగడమే అసలైన గెలుపు

కావలి (టౌన్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో మెలగడమే అసలైన గెలుపు అని ఆర్డీవో వంశీకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో విశ్వోదయా డీఆర్ బాలల దినోత్సవ క్రీడలు ప్రారంభమయ్యాయి. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఆర్డీవో చిన్ని వంశీకృష్ణ హాజరయ్యారు. ముందుగా ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. క్రీడాపరంగా మౌలిక సదుపాయాలు ఇక్కడ ఉండడం గర్వకారణమని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరుగు పందెం పోటీలు ప్రారంభించి విజేతలకు మెడల్స్, బొకేలతో అభినందించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, విజేతలకు నవంబర్ 14న బాలల దినోత్సవ సభలో బహుమతులు ప్రదానం చేస్తారని జేబీ వీడీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. కార్య నిర్వాహకులు రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, జేబీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో వంశీకృష్ణ

చెరువులు, కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు

కావలి,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ పరిధిలోని చెరువులు, కాలువలు, 316 చోట్ల దెబ్బతినగా, పునరుద్ధరణకు రూ. 2832.26 లక్షలతో ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించామని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం జలవనరులశాఖ, సోమశిల అధికారులు, రైతులతో ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చేసిన అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. చెరువులకు పుష్కలంగా నీరు రావటంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అయ్యప్ప పూజలో.. : పట్టణంలోని కలుగోళమ్మపేటలోని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరు శ్రీనివాసులు నివాసంలో శనివారం ఉదయం అయ్యప్ప పడి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక

కావలి (టౌన్) నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం స్థానిక పాతూరు కళాశాలలో ప్రిన్సిపాల్ లుకోధర్ అధ్యక్షతన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల హామర్‌త్రోలో పాల్గొన్న సీహెచ్ లక్ష్మీప్రియ ప్రథమ, పీవీ లక్ష్మీ ప్రసన్న ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. బాలుర విభాగం పోల్ వాల్ట్‌లో ఎన్ రాజేంద్ర, హేమర్‌త్రోలో హేమంత్ తృతీయ స్థానాలు సాధించారు. కరస్పాండెంట్ శ్రీకర్ల వెంకయ్య, డైరెక్టర్లు వీపీఎస్ ప్రసాద్, ఎం కొండయ్య, నందనం మధుసూదన్‌రావులు విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు జీవన్‌కుమార్, వెంకటేశ్వర్లును అభినందించారు.

టిడ్కో గృహ సముదాయంలోని సమస్యలపై బీజేపీ నేత ఆగ్రహం

కావలి (టౌన్) నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో సమస్యల పట్ల బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి కందుకూరి టిడ్కో గృహ సముదాయంలో పర్యటించారు. సముదాయంలో వర్షపునీరు నిల్వ ఉండడంతో పాటు, పరిసరాలు దుర్భరంగా మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రధాని మోదీ టిడ్కో గృహాలను నిర్మించారని, అయితే రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణ సరిగా లేనందువల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. దుర్వాసనతో కూడిన కంపోస్ట్ మట్టిని తోలడం మున్సిపల్ అధికారుల నిర్లక్షానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయడం అన్యాయం

కందుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ షాపింగ్ కాంప్లెక్సుకు విద్యుత్ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయటం అన్యాయమని వైసీపీ నాయకులు గంగిరెడ్డి, రఫీ, బ్రహ్మానందం, వల్లూరి కోటేశ్వరరావు, ఉప్పుటూరి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ కాంప్లెక్స్ వ్యవహారం కోర్టులో కేసు నడుస్తుండగా తీర్పుతో నిమిత్తం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు ఇలాంటిచర్యలకు పాల్పడటం సమంజసం కాదన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

అల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ధాటికి ఇబ్బందులు పడిన రైతులకు రాయితీపై పశు దాణా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి రమేష్ నాయక్ తెలిపారు. శనివారం అల్లూరు మండలం ఇస్కపల్లిలో రైతులకు పశువుల దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అల్లూరు మండలంలోని ఇస్కపల్లి గ్రామ రైతులకు ఈ అవకాశాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇస్కపల్లి ప్రాంత పాడి రైతుల కోసం 9.5 టన్నుల దాణా, 50 కిలోల బ్యాగ్‌ను 50 శాతం రాయితీ కల్పించి రూ.555కు రైతులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాటి రంజిత్, వార్డు సభ్యుడు రవ్వా హరికుమార్, పాపనబోయిన జగన్, అల్లూరు ఏడి మహేశ్వరయ్య, ఇస్కపల్లి పశువైద్యాధికారి అబ్దుల్ రహీం పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డులో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున 11కేవీ ఎంఆర్‌ఓ ఆఫీసు ఫీడర్‌లో ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌మొహిద్దీన్ హాస్పటల్ ఏరియా, సంతోష్‌నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీసు ఏరియా, బూడిదపాలెం, పాతబ్యాంకు బజారు, కోటకట్ట వీధి, అన్నా క్యాంటీన్ ఏరియా, పెద్దబజారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

వేదగిరిపై కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చక బృందం

వేదగిరి క్షేత్రంలో రెండోరోజు శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. విష్వక్సేనపూజతో మొదలైన ఉత్సవాలు అకల్మష హోమం, స్నపన తిరుమంజనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభావాహన, ఆరాధన, పవిత్ర వాస్తు అధివాసంతోపాటు ప్రధాన హోమాలు ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల నేతృత్వంలో సాగుతున్నాయి. వేదపండితుల మంత్రోశ్చరణలు, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత రెడ్డి దంపతులు, ఈవో గోపి, ఉభయకర్తలు పాల్గొన్నారు. ఈ వేడుకలను భక్తులు కనులారా వీక్షించారు.

-నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఆ తల్లికి.. బిడ్డ భారమైంది..!



ఐసీడీఎస్ సిబ్బంది చేతిలో శిశువు

ఆ తల్లికి బిడ్డ భారమైంది. మానవత్వాన్ని మంట గలుపుతూ పసికందును ముళ్లపొదల్లో పడేసింది. ఈ ఘటన జాతీయ రహదారి పక్కన కోవూరుకు సమీపంలో శనివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే... ఓ లారీ డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు జాతీయరహదారి పక్కనున్న పొదల్లోకి వెళ్లాడు. ముళ్ల పొదల్లో బొడ్డుకూడా ఊడని ఓ పసికందును చూసి నిర్ఘాంతపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న ఆ ఆడశిశువును చేతుల్లోకి తీసుకుని దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు పరుగులు తీసి ప్రాణాల్ని కాపాడాడు. వెంటనే శిశువు ముళ్ల పొదల్లో కనుగొన్న విషయాన్ని కోవూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని శిశువును కాపాడమని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. శిశువు పొదల్లో దొరికిన విషయం తెలుసుకున్న స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బిడ్డ సంరక్షణ బాధ్యతలను చేపట్టారు. శిశువును ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిన రక్తసులను గుర్తించి తగిన చర్యలు తీసుకోమని కోరుతూ ఐసీడీఎస్ కార్యాలయ కార్యదర్శి కే ఉమ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముళ్ల పొదల్లో చిక్కిన శిశువును తాము పెంచుకుంటామంటూ పలువురు మహిళలు, వ్యక్తులు పోలీసులను, ఐసీడీఎస్ సిబ్బందిన ప్రాధేయపడడం విశేషం.

-కోవూరు, (ఆంధ్రజ్యోతి)



భూసేకరణలో అన్యాయంపై ఆందోళన

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): 167బీ జాతీయ రహదారి విస్తరణ కోసం మండలంలోని ఓగూరు, ప లుకూరు గ్రామాల పరిధిలో చేస్తున్న భూసేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని బాధిత రైతులు శనివారం నిరసన నిర్వహించారు. తొలుత ఓగూరు సచివాలయంలో సమావేశమైన రెండు గ్రామాల బాధిత రైతులు తమకు జరుగుతున్న అన్యాయంపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపా రు. అనంతరం జాతీయ రహదారిపైకి వచ్చి నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా బాధిత రై తులు నరహరి తదితరులు మాట్లాడుతూ ఓగూరు, పలుకూరు గ్రామాల పరిధిలో జాతీయ రహదా రి పక్కన ఉండే భూములు ప్రస్తుతం ఎకరం కోటి రూపాయలకు పైగా ఉండగా కేవలం రూ. 8ల క్షల ధర నిర్ణయించి ఆ ప్రకారం పరిహారం చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి రైతులను బలిచేయటం అన్యాయమన్నారు.

అవ్వాతాతలు సంతోషంగా ఉన్నారు!



పింఛన్‌పై వృద్ధుడి అభిప్రాయం తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మర్రిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న అవ్వాతాతలు చాలా సంతోషంగా ఉన్నారని కలెక్టరు హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం ఆయన మర్రిపాడు మండలం డీసీపల్లిలో అబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.రూ. 4వేల నుంచి నుంచి వివిధ రకాల పింఛన్లను ప్రభుత్వం రూ. 6వేలు, రూ. 15వేలు వరకు పెంచటంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందచేస్తున్నదన్నారు. క్రమం తప్పకుండా పింఛన్ అందుతుందా ? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా..? అని వృద్ధులను విచారించగా, అందుతున్నాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో మండలంలోని అధికారులు కష్టించి పనిచేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు, ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్, తహసీల్దారు అనీల్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకులు నారాయణరెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌డీవోగా పాండు రంగారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన పాండురంగారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యతిరాజ్

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు అన్నారు. నగరంలోని డీఎస్ఏ కార్యాలయంలో శనివారం ఆయన డీఎస్‌డీవోగా రిటైర్డ్ డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడా రంగంపై అవగాహన ఉంద ని, ఫుట్‌బాల్ కోచ్‌గా జిల్లాలో పని చేసిన అనుభవంతో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తానన్నారు. క్రీడా సంఘాలు, కోచ్‌లు, క్రీడా ప్రముఖులతో సత్సంబంధాలు మెరుగుపరచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యతిరాజ్ మాట్లాడుతూ జిల్లా క్రీడారంగం ఉన్నతికి పాటుపడాలని, విధి నిర్వహణలో అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ యోగా ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-19 బాలబాలికల యోగా ఎంపికలను ఈనెల 2న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి పీ.వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు, 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పొగరాయుళ్లపై కొరడా

- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- పొగతాగితే రూ.200 జరిమానా
- విద్యాసంస్థల్లో అవగాహన
- రెండునెలలపాటు విస్తృత కార్యక్రమాలు
- ఎన్‌సీడీకి బాధ్యతల అప్పగింత
- టీఎఫ్‌వైసీ 3.0కి శ్రీకారం

నెల్లూరు (వైద్యం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, బీడీ, చుట్ట తాగరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ చట్టాన్ని తీసుకువచ్చాయి. అలా చేస్తే రూ. 200 జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కూడా ఇటీవల అధికారులు విడుదల చేశారు. 2003లోనే సుప్రీం కోర్టు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని నిషేధం విధించింది. విద్యాలయాల కు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ ధూమపానం చేయరాదని ఆదేశించింది. అయితే ఆ చ ట్టం సరిగా అమలు జరగలేదు. ఈ నేపథ్యం లో గత జూలై 1 నుంచి ధూమపాన నిషేధాన్ని పూర్తిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ముఖ్యంగా నెల్లూరులోని ప్రధాన కూడళ్లు, కావలి, కందుకూరు పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ధూమపానం నిషిద్ధం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో కూడా నిషేధం. అయితే కొందరు చాటుమాటుగా ధూమపానం సేవిస్తునే ఉన్నారు.

● అమలులో టీఎఫ్‌వైసీ 3.0

జిల్లాలో ఈ విషయమై ప్రచారం నిర్వహించేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ టుబాకో ఫ్రీ యూత్ కాంపెయినింగ్ 3.0 (టీఎఫ్‌వైసీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇం దుకు అనుగుణంగా అవగాహన కార్యక్రమాలకు రూపొందించి ముందుకు సాగుతోంది. ప్రస్తుత సమాజంలో 11 ఏళ్లకే పొగాకు ఉత్పత్తులకు యువత బానిసలవుతున్నారని కేంద్ర కుటుంబ ఆరోగ్య సంస్రమ శాఖ ప్రత్యేక పరిశీలన ద్వారా గుర్తించింది. ఈ నేపథ్యంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనారోగ్య కారణాలపై విస్తృత అవగాహన అవసరమని భావించింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.

● రెండు నెలలపాటు అవగాహన

ఈ నేపథ్యంలో అక్టోబ రు 9 నుంచి డిసెంబరు 8 వరకు జిల్లాలో అవగాహ న కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. తొలిసారిగా పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో వైద్య ఆ రోగ్యశాఖ కూడా ముందుకు వెళుతుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో చదువుతున్న 11 ఏళ్ల పైడిబడిన విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాలోని 2594 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అవగాహన తరగతులను నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) విభాగం చేపట్టింది. తద్వారా 20వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా విద్యార్థులు ఓ ప్రతిజ్ఞ తయారు చేసుకుని పొగాకు అలవాట్లను ఇక నుంచి మానివేస్తామని, ఇంట్లో వారేకాకుండా చుట్టు పక్కల వారి నుంచి కూడా మానిపించే దిశగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయి. ఇందులో సచివాయం ఏఎన్‌ఎంలు కూడా భాగస్వామ్యమవుతారు.



● జిల్లాలో బాధితులు ఎక్కువే..

జిల్లా జనాభాలో 50శాతం మంది పురుషులు, 7.1 శాతం మంది మహిళలు పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నట్లు వై ద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ విభాగం వెల్లడించింది. ప్రతీ ఐదుగురిలో ఒకరు ధూమపానానికి, పాన్ ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ప్రతీఏటా 8 శాతం మంది కొ త్త వారు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చిన్నారులు సైతం ఈ పొగాకు ఉత్పత్తులకు బానిసలు కావటం కలవరపెడుతున్న సమస్య.

పాఠశాలల్లో విస్తృత అవగాహన



పొగాకు ఉత్పత్తుల నిషేధంపై పాఠశాలల్లో అవగాహన తరగతులు ప్రారంభమయ్యాయి. 11ఏళ్ల పైడిన యువకులు సైతం పొగాకు ఉత్పత్తులకు భానిసలవుతున్నట్లు కేంద్రం గుర్తించింది. ఇందుకు అనుగుణంగా అవగాహన తరగతులు డిసెంబరు 8 వరకు కొనసాగుతాయి. ప్రజల్లో పొగాకు ఉత్పత్తులపై చైతన్యం తీసుకు వచ్చేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం.

- డాక్టర్ యశ్వంత్ (ఎన్‌సీడీ నోడల్ అధికారి)

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

● శిక్షణ తరగతుల్లో భాస్కరయ్య



మాట్లాడుతున్న భాస్కరయ్య

నెల్లూరు(హరనాథపురం),నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రా ష్ట్ర ప్రభుత్వం రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం ఏ ర్పాటు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య అధ్యతన రజకుల చైతన్య శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పా ర్టీలు మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్నీ హామీలను అమలు చే యాలని కోరారు. హామీలు అమలు కోసం జరిగే పోరాటం లో రజకులంతా భాగస్వాములు కావాలని కోరారు ఈ కా ర్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, రై తు సంఘం నాయకులు మూలం రమేష్, వడ్డెర వృత్తి దారు ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్, ఇతర నాయకులు చిన్న, గురుశేఖర్, కామయ్యపాల్గొన్నారు.

గిరిజనులు ఆర్థికాభివృద్ధిని మెరుగు పర్చుకోవాలి

● జనజాతీయ గౌరవ్ దివస్‌లో మేయర్ స్రవంతి



గిరిజన విద్యార్థులతో మేయర్ స్రవంతి, ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఆర్థికాభివృద్ధిని మెరుగు పరచుకునేందుకు గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని నగర మేయర్ పోట్లూరి స్రవంతి అన్నారు. శనివారం నగరంలోని గిరిజన భవన్‌లో జనజాతీయ గౌరవ్ దివస్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించటం హర్షించదగిన విషయమన్నారు. నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ధర్తీ ఆబా అనే పేరుమీద కేంద్ర ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రారంభించిందన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 21 గ్రామాలను గుర్తించి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపామని చెప్పారు. గిరిజన సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 500 మంది గిరిజన గురుకుల విద్యార్థులు ప్రాచీన గిరిజన కళ ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

కావలిలో ప్రయాణికుడికి పర్సు అప్పగింత

కావలి, నవంబరు1 (ఆంధ్రజ్యో తి): కావలి ఆర్టీసీ బస్టాండ్ కూల్‌డ్రింక్ షాపు వద్ద కలిగిరి మండలం సిద్దన కొండూరుక చెందిన పైడి కి షోర్ శనివారం తన పర్సు పోగొట్టుకున్నాడు. దానిని ఆర్టీసీ అధికారులు ఆ ప్రయాణికుడికి అందజేశారు. కి షోర్ కూల్‌డ్రింక్ తాగుతూ తన చేతిలోని పర్సును పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ విచారణ కేంద్రంలో ఫిర్యాదు చేయగా, ఈలోపు కూల్‌డ్రింక్ షా పులో పనిచేసే వ్యక్తి పర్సును విచారణకేంద్రంలో అప్పజెప్పి తన నిజాయితీని చాటుకున్నారు. ఆ పర్సులో చిన్న బంగారు ఉంగరంతోపాటు పర్సులో ఉన్న వస్తువల వివరాలు చెప్పటంతో ఆర్టీసీ డీఎం ఆదినారాయణ, బస్సు స్టేషన్ మేనేజరు రామక్రిష్ణ, పోలీస్ అవుట్‌పోస్ట్ కానిస్టేబుల్, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో ప్రయాణికుడికి పర్సును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

6న విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం ఈనెల 6న ఉదయం 10గంటలకు నగరంలోని టౌన్‌హాల్లో జరుగుతుందని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఎం బాషా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వచ్చేశాయ్!

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారని తరచూ మీడియా, ప్రచార మాధ్యమాల ద్వారా వస్తున్న వార్తలను పరిగణలోకి తీసుకున్న భారత అత్యున్నత న్యాయస్థానం పట్టణ, నగర ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. 2018లో ఈ ఉత్తర్వులు ఆయా ప్రభుత్వాలు జారీ అయ్యాయి. అందులో భాగంగా ఏపీలోనూ పట్టణ, నగర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండాలని సూచనలు జారీ చేశారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసే నెట్‌వర్క్ కంపెనీలతో స్థానికంగా ఉండే మున్సిపాలిటీలు ఒప్పందం చేసుకుని నిధులు కేటాయించాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు నెల్లూరులో నిర్వహణ బాధ్యతలను ఎస్పీటీ నెట్‌వర్క్‌కు అప్పగించారు.

ప్రజల సహకారం ముఖ్యం

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ త్వరలో అందుబాటులోకి రానున్నది. ఆ మేరకు వేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే ప్రజల సహకారం చాలా అవసరం. వారికి కూడా సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన పెరుగుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు మేము సిద్ధంగా ఉన్నాము.

- వెంకటరెడ్డి, ట్రాఫిక్ సీఐ

పొలంలో పని చేస్తూ రైతు మృతి

● వారం రోజుల్లో కొడుకుపెళ్లి ● అంతలోనే విషాదం

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నా కొడుకుపెళ్ళి.తప్పక రండి. అని మనుబోలు గ్రామం అంతా పెళ్ళి కార్డులు పంచాడు. సాయంత్రానికల్లా పొలంలో శవమై కనిపించాడు రైతు, కల్లుగీత కార్మికుడు కోసూరు శ్రీనువాసులు గౌడ్. శనివారం చోటుచేసుకున్న సంఘటన గ్రామస్తులను కలిచివేసింది. గమళ్లపాళెంలో విషాదం నెలకొంది. స్థానిక కోదండరామపురంలోని గమళ్ళపాళెంకు చెందిన కోసూరు శ్రీనువాసులు గౌడ్ వరిసాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు. కుమార్తెకు పెళ్ళిఅయిపోగా, కుమారుడికి వచ్చే శనివారం పెళ్ళి నిశ్చయించారు. దీంతో పెళ్ళిపనుల్లో బాగంగా పెళ్ళి కార్డులు పంచాడు. తరువాత మధ్యాహ్నం ఇంటినుంచి పొలానికి వెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీనివాసులు కోసం గాలించారు. పొలంలో శ్రీనువాసులు శవమై కనిపించాడు. గుండె పోటుతో చనిపోయి ఉండవచ్చునని రైతులు, గ్రామస్తులు భావి స్తున్నారు. పొలంవద్దనే బంధువులు, సాటి గీత కార్మికులు, రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

యువకుడిపై పోక్సో కేసు

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను ప్రేమించాలంటూ వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై చిన్న బజారు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల సమా చారం మేరకు.. నగరానికి చెందిన ఓ బాలిక డిప్లమో మొదటి సం వత్సరం చదువుతోంది. ఆమె ఇంటి పక్కనే సాయి నివాసం ఉం టున్నాడు. అతను గత కొంతకాలంగా తనను ప్రేమించాలని బాలిక వెంట పడుతున్నాడు. శుక్రవారం రాత్రి బాలిక ఇంటికి వెళ్లి ఆమె చేయిపట్టుకుని ప్రేమించమని ఒత్తిడి చేశాడు. బాలిక తల్లి అడ్డుకోగా ఆమెను దుర్భాషలాడాడు. ఈ మేరకు బాధిత తల్లి శనివారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం అందచేస్తున్న ఫ్యాప్టో నేతలు

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో నేతలు కోరారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం డీఈవో బాలాజీరావుకు ఫ్యాప్టో నేతలు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఫ్యాప్టో ఛైర్మన్ కే.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత అనే నిబంధన అసంబద్ధమైందన్నారు. దీనిపై ఉన్న నిబంధన చట్టంలో మార్పు తేవడంతోపాటు వెంటనే ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలన్నారు. ప్రస్తుతం టెట్ ఉత్తీర్ణత కావడం వలన విద్యాబోధనలో ప్రత్యేకంగా వచ్చే అభివృద్ధి కానీ, మార్పుగానీ ఉండదని తెలిపారు. సెక్రటరీ జనరల్ షేక్.జావీద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేసిన బదిలీ చట్టం-2025 నిబంధనలకు విఘాతం కలిగేలా బదిలీల్లో కొత్త పాఠశాలల ఎంపిక చేసుకున్న వారిని నేటికీ రిలీవ్ చేయకపోవడం బాధాకరమన్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు పీ.మాధవరావు, సీహెచ్‌వీ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువతి, యువకుడి ఆత్మహత్య

● నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటన

నెల్లూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఓ యువతి, ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు శనివారం వెలుగులోకి వచ్చాయి. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలానికి చెందిన లావణ్య(21)కు నెల్లూరు 4వ మైలు ప్రాంతానికి చెందిన వినోద్‌తో 2023 మేలో వివాహం జరిగింది. వారికి 5 నెలల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం నగరంలోని మల్లెతోటలో నివాసం ఉంటున్నారు. ఇటీవల దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని ఆమె తన కుటుంబసభ్యులకు చెప్పగా వారు పలు మార్లు దంపతులకు నచ్చజెప్పి సంతోషంగా కాపురం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం అర్ధరాత్రి వినోద్ పని నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. శనివారం లావణ్య తన అక్క కీర్తికి, భర్తకు నేను చనిపోతున్నానని మెసేజ్ చేసింది. దీంతో కీర్తి విషయాన్ని తన తండ్రి కోటేశ్వరరావుకు తెలియజేయగా ఆయన నెల్లూరులో ఉన్న తన మరదలు కామేశ్వరికి ఫోన్‌చేసి చెప్పారు. ఆమె తన భర్తతో కలిసి లావణ్య ఇంటికి వెళ్లి చూడగా తలుపులు లోపల గడియపెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లి చూడగా లావణ్య చీరతో ఫ్యానుకు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించింది. వెంటనే ఆమెను కిందకు దించి నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి నెల్లూరుకు చేరుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● లేక్‌వ్యూ కాలనీలో...

నగరంలోని లేక్‌వ్యూ కాలనీకి చెందిన సునీల్(31), సుశీల దంపతులు. సునీల్ ఎలక్ట్రీషన్ పనులు చేస్తున్నాడు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. సునీల్ పలుమార్లు కాపురానికి రావాలని భార్యను కోరినా ఆమె రాలేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆయన శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆయన్ను కిందకు దించి జీజీహెచ్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే సునీల్ మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు మృతుడు తండ్రి వెంకటశేషగిరి శనివారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.